# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 34 సంచిక 1

పేజీలు 40

సెప్టెంబర్ 2014

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


భద్రవాక్యం ....................................2

శ్రీబాబూజీ ఉవాచ................................3

అమ్మమాట..............................................5

సన్నిధిలో సంభాషణ ..............................7

యోగవాశిష్ఠము ................................10

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.....................12

సాంఖ్యయోగ మహాత్మ్యం.......................13

పరిప్రశ్నేన సేవయా.............................15

సద్గురు శ్రీయాత్రా దర్శన్......................17

మనసే అందాల బృందావనం.......................19

ధ్యానం - మాధవ స్థితి.........................20

శ్రీకృష్ణకర్ణామృతము............................22

తరగని ఆధ్యాత్మిక సంపద .....................24

కనకదాసు ......................................26

శ్రీమాతాజీ సత్సంగ కార్యక్రమాలు...........28

భద్రం భద్రం భాద్రపదం........................29

విజయ దుర్గ....................................31

సత్సంగామృతం..................................33

హనుమద్వైభవము..............................35

సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర...........37

విష్ణు కథలు - సదాశివ బ్రహ్మేంద్రసరస్వతి....39

## భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

అపానే జుహ్వతి ప్రాణం। ప్రాణేஉపానే తథాஉపరే।
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః ॥

(భగవద్గీత 4అ./29శ్లో)

శరీరం యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి కొంతమంది ప్రాణాయామ ప్రక్రియను ఆశ్రయించటం గమనించదగినదే. అది శరీర ఆరోగ్యానికి దోహదం చేయటం యదార్థమైనదే. కాని మనస్సు యొక్క చంచలత్వాన్ని నిరోధించటానికి ప్రాణాయామ ప్రక్రియ తాత్కాలికమైన ఫలితాన్ని యివ్వచ్చు గాని శాశ్వత పరిష్కారం మాత్రం అలభ్యం అని సద్గురుదేవులు తెలియజేసేవారు.



ప్రాణాయామంలో మూడు దశలు ఉన్నాయని అందరికి తెలిసినదే. అవి కుంభక రేచక పూరకములు. బయట వాయువుని ఒక నియమిత విధానం ద్వారా లోపలికి పీల్చటం పూరకం. అలా లోపలికి పీల్చిన వాయువుని బలవంతంగా నిలిపి ఉంచటం కుంభకం. లోపలి వాయువును బయటకి పంపటం రేచకం.

రేచకం దేహగతమైన ప్రాణవాయువు. సుషమ్నాంతర్గతిని ప్రాణాయామముగా పిలువబడుతుంది. శ్రీకృష్ణభగవానుడు **ప్రాణాపాన గతీరుద్ధ్వా** అనే ప్రయోగం ద్వారా కుంభకము, అంతేకాక, అపానమందు ప్రాణవాయువును హోమం చేయుటనే పూరకమని, ప్రాణము నందు అపానమును వ్రేల్చుటనే రేచకమని వివరించాడు.

అంతర్ముఖ ప్రాణాయామము ద్వారా పొందే కేవల కుంభకావస్థ సహజమైనది. కుంభకము మననము చేసేది కాదు. అది ఆనంద స్థితి. అది కేవలం కర్మ ద్వారానే పొందగలుగుతావు. శరీరం కేవలం కర్మ అనేది నిష్కామయుత చిత్తాత్ముడికే సాధ్యము. ఆ స్థితిని సాధించిన సాధకుడు అంతర ప్రదేశంలో ఓంకారనాదాన్ని వినగలుగుతాడు. అది శబ్దం కాదు. ఆ నాదం అనుభూతి. మనస్సు విషయాదుల నుండి ప్రత్యాహతం అయినప్పుడే అది సాధ్యపడుతుంది. ఆశ లేకుండా ఇంద్రియ సంయమముతో చేసిన కర్మ 'కేవలం కర్మ'గా పిలువబడుతోంది.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "హంసశివస్సోఽహం" అనేది అజపగాయత్రి మంత్రం. అతి రహస్యమయినది. అది బహిరంగంగా ఎవరూ తెలియజేయరు. కాని మీ హృదయ బాబుకి అరమరికలు లేవు. శ్రీరామానుజులవారు కూడా ఆయన గురుమూర్తి గోష్టిపూర్ణుడు ఉపదేశించిన అష్టాక్షరీ మంత్రాన్ని బహిరంగంగా దేవాలయ గోపురం మీదనుండి భక్తులందరకు తెలియపరచి తరించమన్నారు. చూశారా! పరమహంస స్వరూపులైన మహాత్ములు చేసే మంత్రోపదేశానికి మునుగు అక్కర్లేదు. గురుదక్షిణలు అంతకన్నా అక్కర్లేదు. ధనధాన్యాలు, వస్త్రాలు, ఇవ్వనవసరంలేదు. సోఽహం అనేది సూచనామంత్రం. అది ఉపాసన చేసే మంత్రం కాదు. సోఽహం అనేది సద్గురు మూర్తి మీకు మీస్థితిని తెలిపే భావన. నీవు హంసవు. హంస వివేకము కలిగిన పక్షి. అది తనముక్కుతో పాలనుండి నీటిని వేరు చేయకలుగుతుంది.



అలాగే సద్గురుమూర్తిని ఆశ్రయించిన సాధకుడు ఆయన అందచేసిన లక్ష్యార్థ సాధనతో వివేక వంతుడై, నిత్యా నిత్యవివేకము కలిగి ప్రజ్ఞానం బ్రహ్మ అనే మహావాక్యోపదేశంతో, తన దేహములోనే కర్మేంద్రియాలను, జ్ఞానేంద్రియాలను, అంతరేంద్రియాలను ప్రకాశింపచేసే ప్రజ్ఞ వుందని తెలుసుకొంటాడు. ఆ తరుణంలో వివేకవంతుడైన సాధకునికి ఆ ప్రజ్ఞానం బ్రహ్మావు నీవే అని తెలిపే సూచనా మంత్రమే సోఽహం. నీవు ఎవరవు? అని ఎవరైనా ప్రశ్నించినపుడు నేను ఈ దేహమును కాను యింద్రియాలను కాను అని గుర్తించగలిగిన వివేకవంతుడైన సాధకుడు సాధనద్వారా సోఽహం అనేది మూలాధారము నుండి సహస్రారంవరకూ సంచరించే తేజస్సు అని గుర్తించ గలుగుతాడు.

ఆ తేజస్సే గురుకాంతి లేక గురుశక్తి, లేక చైతన్యము. అదే తేజస్సు సర్వవ్యాప్తమై, సర్వజగత్తుకు ఆధారమైన చైతన్యము అని గ్రహించాలి. అదే సోఽహం అనే భావన. అదే నేను అని భావించే ఆత్మతేజస్సు. అది

అహంకార పూరితమైన నేను కాదు. అది రూప, నామ, క్రియా రహితమైనది. సాధకుడు జగత్తులో వాడేకదా! కాబట్టి ఆత్మ తేజస్సును గుర్తింపజాలడు. జగత్తును దాటినట్లయితే ఆ తేజస్సును దర్శించ గలుగుతాడు. సాధకుడు తన దేహాన్ని ఇంద్రియాలని, మనస్సుని, గుణాలని అధిగమించినప్పుడు కదా ఆత్మతేజస్సును దర్శించ గలిగేది. మీకొక ఉదంతం చెపుతాను. ఒక మానవుడు గాఢ సుషుప్తిలో వున్నాడనుకోండి అతడి మనస్సు అణిగి వుంటుంది. కాబట్టి అది ఏమి తెలియని స్థితి. అదే వ్యక్తి కలత నిదురలో స్వప్నావస్థలో వుంటాడు. స్వప్నంలో అనేక అనుభవాలు పొందుతాడు.

స్వప్నంలో వున్నంతవరకు అవి యదార్థమే కదా! స్వప్నం నుంచి జాగ్రదావస్థకి వచ్చిన తరువాత. ఆ అనుభవాలు యదార్థం కాదని తెలుసుకుంటాడు. అలాగే ఈ జగత్తునుండి బయటపడినప్పుడు తన నిజస్థితి ఏమిటో తెలుసుకోగలుగుతాడు. జాగ్రదావస్థలో వున్నా ఈ దేహ భావన దాటి వెళ్లినపుడే సద్గురు మూర్తి సూచించిన 'సోஉహం' అనే భావన గుర్తించగలుగుతాడు. ఆ స్థితినే నిజ జాగ్రత్త స్థితి అంటారు. కాంతిని దర్శించిన వెంటనే చీకటి అదృశ్యమవుతుంది కదా! స్వప్నావస్థ నుండి జాగ్రదావస్థకి వచ్చిన వెంటనే స్వప్నానుభూతి అసత్యమని తెలుసుకొంటావు కదా! అలాగే దేహ భావనను అధిగమించిన తరువాత ఆత్మ తేజస్సుని దర్శించ గలుగుతావు అదే 'నేను' అని గుర్తిస్తావు.

నామధ్యానాన్ని ఉచ్ఛ్వాశసనిశ్వాసలతో ఏకధారగా చేస్తే గురుమూర్తి అందించిన సోஉహం అనే భావన అనుభవ పూర్వకంగా తెలుసుకో గలుగుతావు. నీ కన్నుతో చూసేది, చెవితోవినేది ఘ్రాణేంద్రియముతో వాసన చూసేది చర్మముతో స్పృశించేది, జిహ్వతో రుచి చూసేది మరియు అన్ని విషయాలను తెలుసుకొనే తెలివి లేక ఎరుక అనుక్షణము నీవెంట వుండి, నిన్ను సత్యమార్గమున అనుసరించమనే వివేకము ఎక్కడ వుందో చెప్పండి? అది నీలోనే వుందా? నీకువెలుపల వుందా? అలా హెచ్చరించేది ఎవరు? అది 'నేను' అని గుర్తించటమే 'సోஉహం' అనే భావన. అదే చైతన్యము, అదే ఆత్మ వస్తువు. దీనిని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి అంటే గురుకృప కావలసిందే!" అన్నారు శ్రీబాబు.

(గత సంచిక తరువాయి) **అమ్మమాట** -జపమాలా ప్రసాద

# వడ్లగింజలో బియ్యపు గింజ

'త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోఽహం భావేన పూజయేత్' - అని స్కందోపనిషత్ చెబుతోంది. అంటే నీ దేహమనే దేవాలయంలో ఉన్న సనాతుడైన సదాశివుని ఎలా పూజించాలో చెబుతున్నారు. నీలో ఉన్న శివుని కప్పివేసిన జన్మజన్మాంతరాల నుండి పేరుకొనిపోయి ఉన్న అజ్ఞానమనే నిర్మాల్యాన్ని తీసివేయాలి. అది ఎలాగ అంటే, దానికి కూడా మహాత్ములు ఒక చక్కటి ఉపాయాన్ని సూచించారు.

నిరంతర భగవన్నామ స్మరణ, జప, ధ్యానాదుల వలన, శ్రవణ, మనన, నిదిధ్యాసల వలన నీకు పట్టిన అజ్ఞానాన్ని తొలగించుకున్నాక అప్పుడు ఆ సదాశివునికి 'సోఽహమ్' అనే భావనతో పూజచేయి. సః = అతడు, అహమ్=నేను అతడే నేను. అంటే నీలోనే ఉండి, నిన్ను ప్రకాశింపజేస్తున్న, స్వయం ప్రకాశ స్వరూపమైన ఏ చైతన్యమైతే వున్నదో, ఏ మంగళస్వరూపం (శివస్వరూపం) ఉన్నదో, అది "నేను" అంటే 'అహమ్' అది నిజమైన న+హమ్ = అహమ్ అంటే చావులేనిది అని అర్థం. కనుక నశించే యీ దేహంలో నాశము లేనటువంటి వస్తువు వున్నది. అదియే నీవు అని మహాత్ములు బోధిస్తున్నారు.

ఈ 'సోఽహమ్' అనే భావనతో చేసే పూజకి బయట నుండి పూవులు కొనాలని గాని, ఆ పూలు ఫ్రెష్‌గా ఉన్నాయా లేదా అనే ప్రసక్తే లేదు. ఇప్పుడు చెప్పండి బయట కొన్న పూలు తాజావా? సోఽహం భావ పుష్పాలు తాజావా? ఆ బయటి పూలకి కూడా తాజాదనాన్నిచ్చేది ఈ సోఽహం భావనే!

ఈ 'సోఽహమ్' అనే భావన మనని సంశయ రహిత అద్వైత శిఖరానికి చేరుస్తుంది. అటువంటి భాసమానమైన పదాన్ని సూచనగా సూచించే మంత్రమే ఈ సూచన మంత్రం. నిజంగా అదే దృష్టితో ఉండి గోవిందాసనం వేసుకుని పడుకుంటే ఎంత హాయిగా వుంటుంది? మనలో నుండి వస్తున్న ఆ నాదబ్రహ్మములో మనం లీనమయిపోవాలి. పరమహంసలు నిరంతరం ఆ నాద బ్రహ్మాసక్తులై

వినోదిస్తూ ఉంటారు. తద్వారా వేదాంత రహస్యార్థాలను వారు గ్రహించి, వాటిని మానవాళికి ప్రబోధం చేస్తారు. శ్రీ ఆదిశంకర భగవత్పాదాచార్యులవారు ఆమోదించిన యీ తత్త్వం, మనకు మన గురుదేవులయిన శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారి ద్వారా ప్రసాదింపబడింది. ఇదే భావన శ్రీశంకరులు తమ 'గురుపాదుకా స్తవమ్'లో ఈ విధంగా చెప్పారు - 'నాద బిందు కళాత్మకమ్। దశనాద భేద వినోదకమ్। మంత్రరాజ విరాజితమ్। నిజమండలాంతర్భాసితమ్।'

ఈ విధంగా మనసుని నిర్మలం చేసుకుంటే అది మహావాక్య బోధకి తయారవుతుంది. అందుకనే మనం వారికి నమస్కరించినప్పుడు మహాత్ములు మనని 'నిర్మలాంతఃకరణ సిద్ధిరస్తు' అని ఆశీర్వదిస్తారు.

నిర్మలమైన అంతఃకరణ అంటే ఈర్ష్యాసూయాదులుగాని, కామ క్రోధాది గుణములుకాని నీ దరిదాపులకి కూడా రాకూడదు. సర్వత్రా సమబుద్ధి కలిగి ఉండాలి. అప్పుడు గాని మహావాక్య బోధ పట్టుబడదు. ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాఽస్మి, అయమాత్మా బ్రహ్మ అనే మహావాక్యాలు జపం చేసే మంత్రాలు కాదు. అవి కేవలం అనుభవించాల్సినవి. ఎప్పుడు అయితే అవి అనుభవానికి వస్తాయో, అప్పుడు గురుదేవులు 'తత్త్వమసి' 'అది నీవు అయిఉన్నావు' అని ముద్ర వేస్తారు. "ఆహా! మా గురువుగారు చెప్పారు! నేను 'తత్త్వమసి' అయిపోయాను!" అని డప్పులు కొట్టుకొని చెప్పుకుంటే అక్కడ మసే మిగులుతుంది.

గురువులు మనసుద్ధరింపజేయటానికి నామరూపాలు ధరించి వచ్చారు. ఒక మానవాతీతమైన గురుశక్తి ఉన్నదని గ్రహించండి.

ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గురోఃపదం।
మంత్రమూలం గురోర్వాక్యం। ముక్తిమూలం గురోఃకృపా॥

బంగారం ఒక్కటే, కానీ ఆభరణాలు అనేకం. అలాగే కుండలెన్ని తయారుచేసినా వాటిలో 'మట్టి' మాత్రం ఒక్కటే. అవి పగిలిపోయినా మట్టి ఒక్కటే. అదే విధంగా యీ సమస్త సృష్టికీ ఆధారభూతమైన అనంతశక్తి లేక చైతన్యము, లేక బ్రహ్మము ఒక్కటే. అది నీలో నీవుగానే ఉంది. ఇదే వడ్లగింజలో బియ్యపు గింజ!

(తరువాయి భాగం పేజి నెం. 16లో చూడండి)

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

18-12-1985

శ్రీబాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "త్యాగయ్య ఎలా తరించాడు? శ్రీరామచంద్రుని దివ్యచరణార విందముల పై మనస్సు నిలిపి ఆయన దివ్యనామాన్ని కీర్తించాడు కనుకనే తరించాడు. మీరు కూడ అలా సాధన చేసి త్యాగయ్య ఎలా భగవంతుడిని మెప్పించాడో అలా మెప్పిస్తే తరిస్తారు. కాని ఇలా నీరసించి నిద్రపోయి బద్ధకిస్తే ఎలా? కామేశ్వరమ్మ ఇదివరలో ఇలాగే పాడేదా వెంకటరత్నం? నిజం చెప్పు? నీలో స్వజాతి విజాతి స్వగత భేదం లేకపోతే నిజం చెప్పగలుగుతావు" అనగానే, రత్నంగారు సమాధానం చెపుతూ 'ఆవిడ ఇదివరకు పాడినట్లుగా లేదు బాబూ' అన్నారు.



శ్రీబాబు మాట్లాడుతూ "ఆవిడ చాలా హుషారుగా పాడుతుంది. ఆవిడ భర్త పోయినప్పడు నా దర్శనార్థము వచ్చింది. అప్పడు ఆవిడకి నలుగురు పిల్లలు. చాలా బాధ పడింది. భగవంతుణ్ణి తలచుకో, ఆయన సహాయం చేస్తాడు అన్నాను. ఆవిడని సంగీత విద్వాంసుడి దగ్గరకు తీసుకువెళ్ళాను. ఈవిడకి సంగీతము నేర్పించమన్నాను. అలాచేస్తే ఆవిడకి చేసిన సహాయానికి నీఆదాయం పెరుగుతుంది. అంతేకాకుండా నీపిల్లలు కూడా అభివృద్ధిలోకి వస్తారు అని చెప్పాను. ఆయన అలాగే చేశాడు. కామేశ్వరమ్మ పిల్లలు కూడ వృద్ధిలోకి వచ్చారు.

చూశారా? భగవంతుడి లీల. నమ్ముకున్నవారికెన్నడైనా లోటు చేశాడా? కృష్ణనామ సంకీర్తన గాని, రామనామ సంకీర్తన గాని శంకరనామ సంకీర్తనగాని చేస్తే అంతకన్నా ధ్యానము ఏముంది? అలా నామ సంకీర్తన చేయగా చేయగా అది క్రమేపి తపస్సు అయిపోతుంది. ఇంక జపతపములతో పని ఏముంది?

పరమాత్ముని నిర్గుణరూపాన్ని అందుకోవాలంటే నీలోని గుణాలు

రహితం కావాలి. పరమాత్మునియందు అంటే గురులక్ష్యార్థము నందు మనస్సు నిలిపితే నీలోని కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, అంతరింద్రియాలు శాంతి పొంది గుణరహితుడవవుతావు. నీలోని అహంకారము చిత్తములోనూ, చిత్తము బుద్ధిలోనూ, బుద్ధి మనస్సులోనూ లయమవుతాయి. దానినే మనోలయము అంటారు. అదే భావసమాధి. అక్కడ ఏమీ కన్పించదు. బాహ్యదృష్టి ఉండదు. అట్టి స్థితిని పొందినవాడికి శతసహస్ర నమస్కారములు. ఏమంటావు వెంకటరత్నం? నేను ఇలా చెప్తే బాబుగారు వీసెడు వంకాయలు కోసేస్తున్నారు అంటారు" అని శ్రీబాబు అన్నారు.

వెంకటరత్నం గారు మాట్లాడుతూ 'అలాకాదు బాబూ! మీరు చెప్పేది చాలా బాగుంది' అన్నారు. శ్రీబాబు 'ధ్యాంక్యూ' అని బోధని కొనసాగిస్తూ "ఇక్కడ మీకు ఒక ఉపమానము చెప్తాను. ఏదైనా ఒక పనిలో నిమగ్నమై పని చేసుకొనేటప్పుడు గాని ఏదైనా ముఖ్యమైనది వ్రాసుకొనేటప్పుడు గాని మీ ముందుగా ఎవరైనా వెళ్తే అది మీకు కనిపిస్తుందా? లేదా ఆఫీసులో పనిచేసుకొనేవారికి రోడ్డుమీద శబ్దాలు అంతరాయము కలిగిస్తాయా? సముద్రపు ఒడ్డున కూర్చొని పని చేసేవారికి సముద్రపు అలలహోరు ఏమన్నా అంతరాయం కలిగిస్తుందా? కనీసము ఆశబ్దాన్ని వినగలుగుతారా? అలా ప్రాపంచిక వ్యవహారాల్లో మునిగిఉన్నప్పుడే అలా ఉండగలిగితే మనస్సు బ్రహ్మామృతాన్ని జుర్రుకునే వాడిస్థితి ఎలా ఉంటుందో ఊహించగలుగుతారా? వాడికి ఇతరమైన భావాలు కలుగుతాయా? కాని మనస్సుని నిలపగలగాలి కదా" అంటూ అంతలోనే భక్తులను పరీక్షిద్దామన్నట్లుగా అక్కడ కూర్చున్న రెడ్డిగారి అబ్బాయి నుద్దేశించి "నువ్వు తల అటూ ఇటూ తిప్పుతుంటే నీవెనక కూర్చున్న మీ మాష్టారుకి అడ్డువస్తున్నావురా. ఊరంతా తిరిగేవాడిని నాకు మాష్టారు అంటే లెక్కేమిటి అనుకుంటున్నావు కదూ! తప్పురా!" అనే సరికి అక్కడ ఉన్న భక్తులంతా అటువైపు తిరిగి చూశారు.

శ్రీబాబు వెంటనే కలగజేసుకుని "చూశారా! ఇంతసేపు నేను భగవంతుడి గురించి చెపుతుంటే నన్ను వదిలేసి అదేమిటండి మీరంతా అటువైపు చూస్తారు. మీ మనస్సు స్వభావాన్ని తెలియజేయటానికి చిన్న

పరీక్ష. దీనికే అలా లొంగిపోతే ఎలా? ఎన్ని ఆకర్షణలు ఉన్నా దృష్టిని పరమాత్ముడిపైననే నిలపాలి. అప్పడే ఆ మధుర్యాన్ని అందుకో గలుగుతారు. భావసమాధి స్థితికిపైన ఒక స్టెప్ ఉంది. ఆ స్థితినుండి కొంచెం పైకి ఎగబ్రాకితే అసంప్రజ్ఞ సమాధిస్థితిని పొందగలుగుతారు. అది నిర్గుణ స్థితి. మనస్సు నిశ్చలంగా నిర్మలంగా ఉంటుంది. ఇక్కడ మీకు ఒక వుపమానం చెపుతాను. కొంతమంది చూడండి, నిదురలో మంచం మీద నుంచి క్రింద పడతారు. కొంతమంది నిదురలో నడుస్తారు లేక పరుగెడతారు. ఇలా రకరకాలుగా ఉంటాయి. నిదుర అనేది గాఢ సుషుప్తి. ఆ స్థితిలోనే అలా ఉంటే తదాకారాన్ని పొంది ఆసంప్రజ్ఞ సమాధిస్థితిలో ఉన్న మనస్సు ఎలా ఉంటుందో ఊహించగలరా? బ్రహ్మరూపము దాల్చిన మనస్సు ఎట్టిస్థితిలోనైనా చలిస్తుందా?

ఇక్కడ మీకు ఒక ఉపమానము చెప్తాను. ఒక శనగగింజని పంచదార పానకంలో ఉంచితే ఏమవుతుంది? ఆ మధురత్వాన్ని పొందుతుంది. ఒకసారి పంచదార పానకంలో ఊరిన తర్వాత ఆపానకంలో దానిని ఎంత కదిపితే మాత్రం ఆ సెనగగింజ మధురత్వాన్ని కోల్పోతుందా? అదే ఏకాగ్ర దృష్టి అంటే. నేను రెడ్డిగారి అబ్బాయి మీదికి మీ దృష్టిని మళ్ళించేసరికి మీ అందరి తలలు ఎలా స్పీడుగా అటు తిరిగాయో అంత ఆవేదనతో పరమాత్ముడు ఎక్కడ? పరమాత్ముడు ఎక్కడ? అని వెదుక్కోవాలి. మనస్సు ఇంద్రియాలన్నిటికి మెయిన్ స్విచ్ కాబట్టి మనస్సుని పరమాత్మయందు నిలిపితే ఉద్భవించిన శక్తి మనస్సు ద్వారా అన్ని ఇంద్రియాలకు వ్యాపించి మనోలయము అవుతుంది. అది ఎలా? అని మీరు ప్రశ్నించవచ్చు. ఒక దీపము ఉందనుకోండి. దాని కాంతి ఆ దీపానికే పరిమితమై ఉంటుందా? అది అంతటా వ్యాప్తి చెందుతోంది కదా!" అన్నారు శ్రీబాబు.

సమర్థసద్గురు మాసపత్రికకు సభ్యులుగా చేరండి! చేర్చండి! మీ సభ్యత్వం ముగిసే తేదీ ఎడ్రస్ కూపన్‌మీద ఉంటుంది. దాని ప్రకారం మీ సభ్యత్వాన్ని సకాలంలో పునరుద్ధరించుకోండి!

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

కొన్ని వేల సంవత్సరాల తర్వాత, భృగు మహర్షి నిర్వికల్ప సమాధి నుండి బాహ్య స్మృతికి వచ్చాడు, కన్నులు తెరచి, పక్కన చూచేటప్పటికి, తన పుత్రుని శరీరము అస్థిపంజరముగా పడివున్నది. అతనికి చాలా ఆగ్రహము వచ్చి యమధర్మరాజును దూషించటము ప్రారంభించాడు. యముడు భృగు మహర్షి ముందు వాస్తవ స్థితి వివరించటానికి ప్రత్యక్షమైనాడు. భృగు మహర్షితో యిలా చెప్పాడు "ఓ మహర్షీ! నేను కేవలము ఈశ్వరాజ్ఞను శిరసావహిస్తూ, ఈశ్వర న్యాయ సూత్రాలను పాటిస్తున్నాను. మీరు మీ తపస్సును ఆగ్రహంతో పాడుచేసుకోవద్దు. ఈశ్వరాజ్ఞను, న్యాయ సూత్రాలనెవరూ మార్చలేరు అధిగమించలేరు బ్రహ్మములో క్రియాలేదు, సంతోషములేదు, బ్రహ్మము నిత్యమూ పవిత్రము, క్రియారహితము, మార్పులేనిది. సత్య దృక్పథంలో చూస్తే నటుడు



లేడు, ఆనందించేవాడు లేడు, అజ్ఞానముతో కూడిన యీ జగత్తులో నటుడు, ఆనందించేవాడు కర్మవున్నాయి. జగత్తులోని జీవులందరూ సంకల్పము చేతనే సృజింపబడ్డారు. వారు తమ కర్మఫలాన్ని అనుభవిస్తారు. మీరు నన్ను నిందించటములో న్యాయము లేదు. మీ పుత్రుడు తన సంకల్పాల వలనే యీ స్థితికి వచ్చాడు. మనసుతో చేసే క్రియలే కేవలము వాస్తవమైన కర్మ.

పసిపిల్లలు ఆటల్లో మట్టితో చేసిన బొమ్మలను ముక్కలు చేసినట్లు, అజ్ఞానము కూడిన మనసు దుష్టత్వమునకులోనై, దేహాన్ని నశింపచేస్తుంది. మనసు కోరికలతో భౌతిక జగత్తుకు బంధింప బడుతుంది. ప్రాపంచిక విషయాసక్తతతో, ఆశయాలతో మనస్సు స్వేచ్ఛను కోల్పోతున్నది. మనస్సు తనలో తానిలా భావిస్తుంది "ఇది నాశరీరం, యిది నా శిరస్సు వీరింతా నావారు (ఆత్మీయులు) 'ప్రాపంచిక జీవితంలో యిది జీవుడ'ని పిలువబడుచున్నది దాని నిశ్చయం ద్వారా బుద్ధియని పిలువబడుచున్నది". 'నేను', 'నాది 'యనేవి ఆగ్రహ

చిహ్నాములతో ఆలోచన ధృవీకరింపబడి అహంకారమని పిలువబడుచున్నది. ఇదే మనస్సు తాను చేసే వివిధ కార్యాల వల్ల వివిధమైన పదవులతో తెలియ బడుచున్నది.

ఇదే మనస్సు అనేక వైవిధ్య భావాలతో, విశ్వంగా రూపొందుతున్నది. మనసెప్పుడైతే సత్య కాంతిని గ్రహిస్తుందో అప్పుడు వికాసవంతమైన మేధస్సుగా పిలుబడుతుంది. నీవు, నీ పుత్రుడు ధ్యాన నిష్ఠలో వుండగా, అతని బలీయమైన కోరికతో యీ దేహాన్ని వదలి పక్షి తన గూటిని వదలి, స్వేచ్ఛగా గాలిలో యెగిరినట్లు, దివ్య ధామాన్ని చేరుకొన్నాడు.

అక్కడ విశ్వవసువనే దివ్యుని సాంగత్యము లభించింది తరువాత దేవలోకాన్ని వదలి ఊర్ధ్వలోక వాతావరణము నుండి బయటకు వచ్చి, దేశర్ణయని పిలువబడే ప్రాంతంలో బ్రాహ్మణ పుత్రునిగా జన్మించాడు తరువాత అనేక జన్మలకొచ్చాడు. కోసల దేశ రాజుగా, నొక అడవిలో వేటగానిగా, గంగా తీరాన హంసగా, సూర్యవంశరాజుగా, పుండ్రుల రాజుగా, సాల్వదేశంలో సూర్య వంశీయునికాచార్యునిగా అనేక జన్మలనెత్తాడు. అంతేగాక నొక కల్పకాలము విద్యాధరులకు రాజుగావున్నాడు తర్వాత నొక మునీశ్వరునికి మేధా సంపన్నుడైన కొడుకుగా, తదనంతము సారవ దేశానికి రాజుగా జన్మించాడు. ఈ జన్మ పరంపరలో మరొక దేశంలో, శైవులకు రాజుగా, ఒక అడవిలో బోయవానిగా, మరొక దేశంలో నెదురుగుట్టగా, వింధ్య పర్వతాలలో కైకటవలో నొక వేటగాడిగా, త్రిగర్తలో గార్ధభంగా జన్మించాడు.

ఆ విధంగా పూర్వ జన్మ వాసనల ప్రభావంతో అనేకుల గర్భాలలో ప్రవేశించి, ఉన్నతమైన, నీచమైన అనేక జన్మలను పొందాడు. చివరకు గంగాతీరాన నొక బ్రాహ్మణుని పుత్రునిగా వాసుదేవుడనే పేరుతో వర్ధిల్లాడు. ఈ జన్మలో, అతను యింద్రియ నిగ్రహాన్ని సాధించి, ఎనిమిది వందల వత్సరాలు, జడలు కట్టిన జుట్టుతో తపస్సా చరించాడు. నీ కుమారుని యొక్క మాయా జనితమైన జన్మ పరంపరను, దివ్య దృష్టి ద్వారా గ్రహించగలవు."

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

సెప్టెంబర్ 2014
5 శుక్ర : టీచర్స్‌డే, ఉదయం 10గం. శ్రీసద్గురుపాదపూజ
9 మంగళ : పూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ
18 గురు : శ్రీగురుదశమి, సత్సంగసమావేశము, శ్రీసద్గురుపాదపూజ.
22 సోమ : మాసశివరాత్రి
24 బుధ : మహాలయ అమావాస్య
25 గురు నుండి అక్టోబర్ 4 శని వరకు : శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలు
25 గురు : శ్రీ మాతాజీవారిచే దీక్షా స్వీకారం, అఖండ జ్యోతి ప్రజ్వలనం
26 శుక్ర నుండి అక్టోబర్ 3 శుక్ర వరకు : ప్రతి నిత్యము ఆధ్యాత్మిక ప్రసంగాలు, మాతాజీవారి దివ్యబోధ, శ్రీగురుదేవుల దివ్యదర్శనము, బోధ (వీడియో), మ్యూజియమ్ దర్శనం.
అక్టోబర్ 2014
1 బుధ : మూలానక్షత్రం , శ్రీ సరస్వతి పూజ, సామూహిక పూజలు
2 గురు : దుర్గాష్టమి మరియు మహర్నవమి
3 శుక్ర : విజయదశమి నామకరణములు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసములు, సామూహిక పూజలు
4 శని : ఏకాదశి ఏకాహం, దీక్షా విరమణ, మంత్రాక్షతలతో మాతాజీ ఆశీస్సులు, జగన్మాత ఊరేగింపు, రాత్రి 8 గం.లకు శ్రీసద్గురుపాదపూజ.
8 బుధ : పూర్ణిమ శ్రీమాతాజీవారి జన్మదినోత్సవము, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన
18 శని : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
22 బుధ : మాసశివరాత్రి, నరక చతుర్దశి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము.
23 గురు : దీపావళి, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాసులు కాల్చుట
26 ఆది నుండి నవంబరు 4మంగళ వరకు : ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వర స్వామికి పంచామృతాలు, నవరసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన.
27 సోమ : నాగుల చవితి.

## సాంఖ్యయోగ మహాత్మ్యం

- ఓం కాళీ

దక్షిణదేశంలో పురందరపురం అనే గ్రామంలో దేవశర్మ అనే బ్రాహ్మణుడు అతిథి పూజలు, యజ్ఞయాగాదులు, తపస్సులు చేస్తూ ఎంతో ఆనందంగా జీవిస్తూండేవాడు. ఆయన పూజల వల్ల దేవతలు కూడా ఆనందపడేవారు. కానీ ఆయనకు మనశ్శాంతి లభించలేదు. తత్త్వజ్ఞానానందాన్ని పొందాలనే ఆశతో ఆ గ్రామానికి వచ్చే సాధువులు, మహాత్ములను సేవించసాగాడు.

కొంతకాలం తరువాత ఒకరోజు పరిపూర్ణ అనుభవం కలవాడు నిత్యసంతుష్టుడు అయిన ఒక మహాత్ముని దర్శనం కలిగింది. ఆయన సమక్షంలో తను ఏ ఆనందాన్ని శాంతిని కోరుకున్నాడో అది దొరుకుతుంది అనిపించింది. దేవశర్మ ఆ మహాత్మునితో "స్వామీ! నాకు మనశ్శాంతి ఎలా లభిస్తుంది?" అని ప్రశ్నించాడు. అప్పుడు ఆయన "దేవశర్మా! సౌపురం అనే గ్రామంలో మిత్రవంతుడు అనే మేకల కాపరి నీకు ఉపదేశిస్తాడు వెళ్ళు" అని చెప్పాడు.

దేవశర్మ ఆ మహాత్ముని పాదాలకు నమస్కరించి, ఆ గ్రామం చేరాడు. ఆ గ్రామ ఉత్తరప్రాంతంలో విశాలమైన ఒక ఉద్యానవనం, ఆ వనంలో ఒక నది, ఆ నది గట్టుపైన మిత్రవంతుడు ధ్యానసమాధిలో కూర్చుని ఉన్నాడు. ఆయన సమీపంలో పరస్పర విరోధ జంతువులు ప్రేమతో కలిసి తిరుగుతున్నాయి. ప్రశాంత సమయంలో ధ్యానముద్రలో ఉన్న మిత్రవంతుని దగ్గరకు వెళ్ళి "మహాత్మా! ఆత్మజ్ఞానం గురించి తెలుసుకోవాలని ఉంది. దానికై తమరు నాకు ఉపదేశం చేయ"మని ప్రార్థించాడు.

ఆ మాటలు విన్న మిత్రవంతుడు "మహనీయా! నేను ఒకప్పుడు అడవులలో మేకలను మేపుకొనే సమయంలో ఒక భయంకర పులి మమ్ములను తినేసేలా మా వైపు రాసాగింది. మేకల గుంపులు చెల్లాచెదురైపోయాయి. కాని ఒక మేక మాత్రం నిర్భయంగా పులి దగ్గరకు పోయింది. పులి దానిని చూసి స్థాణువులా నిలబడిపోయింది. అంత మేక "ఓ పులి రాజా! నీ కిష్టమైన ఆహారాన్ని నేను. నీకు ఎదురుగా ఉన్నాను. నన్ను తిని నీ ఆకలి తీర్చుకో" అని అనగానే, ఆ పులి "ఓ మేకా!

నీవు ఇక్కడకి రాగానే నాకు ఏ విధమైన ద్వేష భావము కలగటంలేదు. ఆకలిదప్పులు కూడా మాయమయ్యాయి" అంది.

మేక "ఇంత నిర్భయత్వం ఎలా వచ్చిందో నాకు తెలియటం లేదు. నీకేమైనా తెలిస్తే చెప్పగలవా?" అని అడిగింది. పులి "నాకు కూడా తెలియటం లేదు. అదిగో అక్కడ ఒక మహాపురుషుడు ఉన్నాడు. ఆయన్ను అడుగుదాం" అని ఆ రెండూ కలిసి నా వద్దకు వచ్చి ప్రశ్నించాయి. నేను నిలబడి ఉన్న చెట్టు పైన ఒక కోతి కూర్చుని ఉంది. మేము ఆ కోతిని ప్రశ్నించాము. ఆ కోతి మాట్లాడుతూ "ఓ మేకల కాపరీ! ఇక్కడ ఎదురుగా బ్రహ్మచే ప్రతిష్ఠితమైన శివాలయం ఉంది. పూర్వం సుకర్ముడు అనే మహాత్ముడు ఇక్కడ చాలాకాలం తపస్సు చేసి శివుణ్ణి ఉపాసించాడు. నిత్యం శివారాధన చేశాడు. చాలా కాలం తరువాత ఒక అతిథి ఆయన వద్దకు వచ్చాడు. సుకర్ముడు "నా శివారాధన పరిపక్వమైనది. మీ వంటి పురుషుల సాన్నిధ్యం లభించింది" అన్నాడు. అతని మాటలు విన్న ఆ అతిథి ఒక శిలాఫలకంపై రెండవ అధ్యాయం 'సాంఖ్యయోగం' వ్రాసి యిచ్చి నీవు రోజూ దీనిని చదువుతూ ఇతరులచేత కూడా చదివించు. దీనివలన నీకు ఆత్మజ్ఞానం లభిస్తుంది" అని పలికి అంతర్ధానమయ్యాడు.

సుకర్ముడు ఆ మహాత్ముని ఆదేశాన్ని పాటించాడు. అందుచేత అతనికి అంతఃకరణ పవిత్రమై ఆయనకు ఆత్మజ్ఞానం లభించింది. ఆయన ఎక్కడకు వెళ్ళినా ఆ ప్రదేశం ప్రశాంతంగా ఉండేది. ఆయన వున్నచోట రాగద్వేషాలు, సుఖఃదుఖాలు, భయం అనేవి ఉండేవి కావు. ఇదంతా ద్వితీయ అధ్యాయాన్ని పారాయణ చేయుట వలన కలిగిన ఫలితం అని గ్రహించండి" అని ఆ కోతి ముగించింది.

మిత్రావంతుడు ఆ శిలాఫలకం మీద వ్రాసియున్న భగవద్గీత ద్వితీయ అధ్యాయం మరల మరల చదివి, ఆత్మజ్ఞానాన్ని పొందాడు. అతని ఉపదేశం విన్న దేవశర్మ ఆయనకు నమస్కరించి తిరిగి పురందర పురం చేరి ఈ అధ్యాయాన్ని పఠించి పరమపదాన్ని పొందగలిగాడు. దీనిని విష్ణుమూర్తి లక్ష్మీదేవికి, పరమేశ్వరుడు పార్వతీదేవికి వివరించారు.

# పరి ప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

సద్గురుదేవులు 'నేను ఎవరు?' అని ప్రశ్న వేసుకోమనేవారు. 'నేను' అనే తలంపే అశాంతికి కారణము. 'నేను' అనేది మనస్సులో మూలము. అది తొలగాలి. "నేను" అనే ప్రత్యేకతను వ్యక్తం చేసే ఆలోచన తొలగాలి. దానితోనే రాగద్వేషాలు. యదార్థమైన నేను ఆలోచనలకు



అతీతమైనది. దానిని గుర్తించాలి. మనస్సు గుణాలతో భావాలతో జీవిస్తుంది. అది సంకల్ప వికల్పముల సంపుటి.

మనస్సు మేల్కొంటే బహిర్ముఖ మైన ఇంద్రియాలని దేహాన్ని చూస్తుంది. అంతర్ముఖమైతే "నేను ఎవరు?" అన్న ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. దాన్ని సాధించటానికి గురుసంస్కారం కావాలి. మేల్కొన్న మనస్సు క్రియ చేస్తుంది. అందువలననే దానిని అభిముఖం చేయాలి. అలా చేయాలంటే మనస్సుకి కావలసిన దాన్ని అందజేయాలి. అదే విచారణ. "నేను ఎవరు?" అనే విచారణని అందించే ప్రభువు గురుమూర్తి.

'నేను' అనేది ఉనికి. 'నేను' ఉన్నానా అనే ప్రశ్న ఉదయించదు. "నేను ఎవరు?" అనే ప్రశ్నని నా ఇంద్రియాలు తెలుసుకోలేవు. కాని వాటికి ఆధారం "నేనే". భౌతికవాదులు 'జగత్తు సత్యం బ్రహ్మ మిధ్య' అంటారు. అలాగే ఆస్తికులు 'బ్రహ్మ సత్యం, జగత్తు మిధ్య' అంటారు. ఆ ఇద్దరిలో ఏ ఒక్కరూ 'నేను' మిథ్య అని అనడు. ఇద్దరి దృష్టిలో 'నేను' సత్యం.

దేవాలయంలోనే ఉంటాడు. భగవంతుని ఆరాధిస్తాడు. ఉపాసన చేస్తాడు. అటువంటి వ్యక్తికి శాంతి చేకూరవచ్చు కాని భగవంతునితో ఉన్నామనే భావన కలుగుతోందా? సందేహమే. ఆ వ్యక్తి వెలితి లేకుండా ఉంటాడా? అది కూడా చెప్పలేము. నేను భగవంతుడిని

పట్టుకోవాలని అన్నదానికన్న "నేను ఎవరు?" అన్న అన్వేషణ నిన్ను భగవంతునికి దగ్గరగా చేరుస్తుంది. ఆదే ఆత్మ విచారణ.

గదిలో భగవంతుడిని పూజించి, ధ్యానించి పొందే ఆనందంకన్న మదిలో ఉన్న భగవంతుడిని గుర్తించగలిగితే నీ ధ్యేయం నెరవేరినట్లే సుమా!

ధ్యానం చేసేటప్పుడు చేస్తున్నాననిగాని, చేయటంలేదని గాని భావన లేకుంటే నీ మనస్సు ఎక్కడుంది? అదే అభావ స్థితి. అక్కడ ద్రష్ట అంతర్ధానమై తానే మిగులుతాడు. అదే అనుభూతి.

---

## ('అమ్మమాట' పేజీ నెం. 6 తరువాయి భాగం)

"ఇది ప్రాతఃకాల ప్రబోధం. చక్కగా స్నానం చేసి ధ్యానానికి కూర్చుంటే నిద్ర రాకుండా ఉంటుంది. లేకపోతే నిద్ర, బద్ధకం ఆవరిస్తాయి. మీ ఇంటిలోనే ఒకచోట చక్కగా మీ దేవతార్చన పెట్టుకుని, తెల్లవారు ఝామునే లేచి, అక్కడ దీపారాధన చేసి, రెండు అగరవత్తులు వెలిగించి కూర్చుంటే మీకు ధ్యానానికి మంచి ప్రశాంత, పవిత్ర వాతావరణమేర్పడుతుంది.

ప్రతినిత్యం సాధన చేయండి. అయితే 'మాకు ముక్తి ఎప్పుడు వస్తుందండీ?' అని అడగకండి. అది మీ పైనే ఆధారపడి ఉంది. త్వరపడండి. అటువంటి సాధనా సంపత్తిని, అఖండ భక్తిజ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!"

# సద్గురు శ్రీ యాత్రా దర్శన్

- పి. సుధారాణి

శంకర జయంతి ఉత్సవంలో ఆనందంగా పాల్గొని, 5-5-14 ఉదయం 2-15ని॥లకు ఢిల్లీకి జి.టి. ఎక్స్‌ప్రెస్‌లో 120 మంది యాత్రికులము సద్గురుదేవుల సంపూర్ణ అనుగ్రహంతో అమ్మ సంకల్పించిన సద్గురు శ్రీ యాత్రా దర్శన్‌కి బయలుదేరాము. రైలులో భక్తులతో సత్కాలక్షేపంతో కాలం తెలియలేదు.

6-5-14

ఉదయం 6-30ని॥లకు ఢిల్లీ చేరాము. బిర్లామందిర్‌లో వసతి. యాత్ర నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు. కాల కృత్యాలు తీర్చుకుని ఫలహారం చేసి బస్సులో బయలుదేరి కుతుబ్‌మినార్, కాత్యాయని ఆలయం, బహాయ్ మతస్తుల ధ్యాన మందిరమైన లోటస్ టెంపుల్ చూసి గాంధారి సమాధి రాజ్‌ఘాట్‌లో దర్శించుకుని, భోజనం చేసి, మధ్యాహ్నం అక్షరధామ్ వెళ్ళాము. స్వామి నారాయణ చరిత్ర దృశ్య శ్రావ్య సాధనం ద్వారా ఎన్నిమార్లు చూసినా తనివి తీరదు. భగవదంశలు అయిన మహాత్ముల జీవితం జీవకోటిని ఎంతగానో ప్రభావితం చేస్తుంటాయి. సాయంత్రం తిరిగి బస చేరుకుని భోజనం చేసి, బస్సులో కురుక్షేత్రానికి బయలుదేరాము.

7-5-14

ఉదయం 3గంటలకి కురుక్షేత్రం చేరుకున్నాము. ఈ ప్రయాణం మా యాత్రలో లేదు. అయినా శ్రీకృష్ణ పరమాత్మ మమ్మల్ని రప్పించుకున్నాడు. గీతోపదేశం జరిగిన పుణ్య స్థలం, మఱ్ఱిచెట్టు వద్ద లింగాకృతిగా రూపు దిద్దుకున్న మఱ్ఱివేరుని అర్చించుకుని, అమ్మ పాదాల వద్ద కూర్చుని అందరం గ్రూప్ ఫొటో తీయించుకున్నాము.

అక్కడ నుండి బయలుదేరి మధ్యాహ్నం చండీఘర్ చేరాము. చక్కటి ప్రణాళికతో నిర్మించిన నగరం. పరిశుభ్రమైన నగరం. తరువాత వృథా పదార్థాలతో తయారైన రాక్‌గార్డెన్ (రాళ్ళ ఉద్యానవనం) చూశాము. చాలా పెద్దది. భోజనం ముగించుకుని మానసాదేవి ఆలయం (శక్తిపీఠం) చండీఘడ్ దగ్గర మనిమజ్ర అనే ఊరిలో

దర్శించుకున్నాము. విశాలమైన, పవిత్ర ప్రదేశం. సతీదేవి శిరస్సు పడిన స్థలం. 5 శిరస్సులతో, 3 చేతులతో, ఉత్తరదేశ అలంకారములతో ఎఱ్ఱని వస్త్రములతో తేజరిల్లుతూ తల్లి దర్శనమిచ్చింది.

మనస్సులోని కోర్కెలు తీర్చే మానసాదేవిగా ప్రసిద్ధి చెందింది. పూరాతనమైన మహావృక్షానికి ఎఱ్ఱని వస్త్రములతో ముడివేస్తే భక్తుల కోరిక తీరుతుందని నమ్మకం. లెక్కకు మించిన ఆ ముడులు చూసిన నాకొక భావన 'అమ్మా! నీవే కావాలి తల్లీ అని కోరుకోకుండా, అంత దూరం వెళ్ళి అల్పమైన కోరికలు కోరుకుంటున్నామే! ఆ విధంగానైనా బిడ్డలు తన దగ్గరకు వస్తున్నారు కదా! అని ఆ తల్లి తృప్తి పడుతున్నది కదా!' అనిపించింది నాకు.

-సశేషం

## విజ్ఞప్తి



'సమర్థ సద్గురు' మాస పత్రిక చందాదారులుగా ఉన్నవారు కేవలం రూ॥ 50 చెల్లించి, క్రొత్తవారిని చందాదారులుగా చేర్చవచ్చు. వీరికి తెలుగుమాస పత్రిక ఒక సంవత్సరంపాటు, లేక ఆంగ్ల త్రైమాసపత్రిక అయితే 3సంవత్సరములు పంపబడును.

చందాలు గ్రంథాలయాల పేరున, సంస్థల పేరున కడితే ఎంతోమందికి ఉపయోగంగా ఉంటాయి.

తెలుగు మాసపత్రికకు, ఆంగ్ల త్రైమాసపత్రికకు మీ బంధువులను, స్నేహితులను, తోటి ఉద్యోగులను, ఆస్తిక మహాశయులను చందాదారులుగా చేర్చి పత్రిక అభివృద్ధికి తోడ్పడండి.

# మనసే అందాల బృందావనం

-పెనుమాక నాగేశ్వర రావు

మనసే అందాల బృందావనం
మన బాబు పేరే మధురామృతం
కమ్మని నగుమోము కాంచుటే తొలి నోము
కడగంటి చూపైన కడు పావనం ॥మనసే॥

బాధల నొకవైపు మాన్పించులే
సత్య శాంతుల నొకవైపు అందించులే
మనసార స్మరియింప తన నామమే
నేనుండ మీకేల భయమందురే ॥మనసే॥

బోధల నొకరీతి వినిపించులే
సాధన లింకొక రీతి నేర్పించులే
వేదనలెన్నైన తొలగింతురే
తనదైన తీరున తరియింప చేయునులే ॥మనసే॥

ఒక చేత పూజలు సేయింతురే
వేరొక చేత సేవలు జరిపింతురే
మాకు మరుజన్మ లేకుండ దీవింతురే ॥మనసే॥
మనసే అందాల బృందావనం మన బాబు పేరే మధురామృతం



(గత సంచిక తరువాయి) **ధ్యానం - సాధన స్థితి (1)** - రేఖ

"సృష్టిలో మానవుడు స్టోర్ చేసుకున్నట్లు యింక ఏ యితర జీవీ చేయదు. వస్తువులు మనల్ని పట్టుకుంటున్నాయా? మనం వస్తువులని పట్టుకుంటున్నామా? విషయాదులతో పెట్టుకుంటే అవి పట్టుకుంటాయి. అంటే జ్ఞానేంద్రియాలతో విని, కనిన తరువాతనే ఫలాన వస్తువు బాగుంది అని తినడమో, అనుభవించడమో జరుగుతుంది. ఆవిధంగా ఎన్నో అనవసర విషయాలు సేకరిస్తాము. ఈ మనస్సు అనే స్టోర్‌ని ఖాళీ చేసుకోవాలి.

మన నిజస్థితిని తెలుసుకోవడానికి ఒక సమర్థుడైన గురువుని ఆశ్రయించాలి. ఎందుకంటే 'అనంతశాస్త్రం బహువేదితవ్యం' అన్నట్లుగా శాస్త్రాలు చాలా ఉన్నాయి. కాలం ఎంతుందో చెప్పలేం. అవన్నీ అధ్యయనం చేయటానికి అనేక విఘ్నాలు వస్తాయి ఆ ప్రయత్నంలో. అటువంటప్పుడు సారవంతమైనది ఎంత కావాలి? మాత్ర చిన్నదే అయినా పథ్యం చాల ముఖ్యం. అలాగే తరించే ఉపాయం సులువైనది, అనుకూలమైన మార్గాన్ని చూపిస్తారు. గురూపదేశం చిన్నది. ఉపన్యాసం, బోధ పెద్దవి.

మహాత్ములను అనుకరించకూడదు. వారిని అనుసరించాలి. బంధ రహితం చేసేది ఉపదేశం. నామం చిన్నదైనా రుచి తెలిస్తే మనస్సు ఆ నామం యొక్క రూపం పొందుతుంది. గురువులతో ఉండి సంచరిస్తే, వారి ప్రతి కదలిక మీద దృష్టి పెట్టి చూస్తే విషయం తెలుస్తుంది. ఆ అనంత శక్తి లోనుంచి సృష్టింప బడ్డాడు మానవుడు. ఆ మానవుడు రూప నామ క్రియా రహితమైన తన నిజ స్వరూపం గుర్తించటానికి ఆ అనంతశక్తి రూపనామాదులను తీసుకుని, మహాత్ముల రూపంలో అవతరించి, వారి లీలలు, సన్నిధి ద్వారా నిజమైన ఆనందాన్ని మానవులకు ప్రసాదిస్తున్నది. వారి లీలలు మానవ జీవితానికి మూలం. వారి సన్నిధిలో నివసించాలని తీవ్రమైన పట్టుదల, జిజ్ఞాస ఉండాలి. పరీక్షిత్తు మహారాజు లాగ శ్రవణం చేయాలి . శాపం వచ్చిందని ఆయన దుఃఖించలేదు. అటువంటి జ్ఞాన పిపాసిని వెతుక్కుంటూ శ్రీశుకమహర్షి ఆయన దగ్గరకు వచ్చారు.

సాధకుడికి తొట్రుపాటు, ఖంగారు ఉండకూడదు. జనక

మహారాజు  రాజ్యం తగలడి పోతోందని చెప్పినా నిశ్చింతగా ఉండి తత్వ విచారణలో మునిగి ఉన్నారు. వారు రాజ్య భారం అప్పగించి వచ్చారు. వారికి చింత లేదు. కంగారు పడితే జ్ఞానం మరుగున పడిపోతుంది. తొట్రుపాటు పడితే ఏదీ సాధించలేము. శ్రీగురుదేవులు, పరశు రామయ్యగారు. (వారిని శ్రీబాబు 'నాన్నగారు' అని పిలిచేవారు.) తత్వవిచారణలో కాలతీతమైనది అన్న విషయమే మరచి, భోజనం దగ్గర కూర్చుని చేతులు ఎండిపోయినా గమనించే వారు కాదని, తెల్లవారిపోయేది అని విని ఉన్నాము. వీరంతా జ్ఞానులు ఎందుకయ్యారో యీ విషయాలని బట్టే తెలుస్తోంది.

గురువులు మనతోపాటే ఉన్నారు. మనం దృష్టిపెట్టి చూస్తే తప్ప వారి ప్రవర్తన అర్థం కాదు. దక్షిణామూర్తి స్వామి చిన్ముద్ర ద్వారా బోధ అందించారు. దత్తాత్రేయులవారిని చూస్తే వారి చుట్టూరా నాలుగు కుక్కలు (అంటే నాలుగు వేదాలు); చేతిలో మధుపాత్రతో (అంటే సచ్చిదానందామృతాన్ని గ్రోలుతూ) దర్శనమిచ్చేవారు. ఈ విషయం సాధనలో ఉన్నవారికే తెలుస్తుంది.

రాముడు మాయామానుష విగ్రహుడు అని సీతమ్మకు తెలుసు. రావణుడిని సంహరించటానికి ఆమెకు శక్తి ఉన్నప్పటికీ ఆ అవతార ధర్మ ప్రకారం రాముడే రావణుడిని సంహరించాలి. సీతమ్మ తన ధర్మాన్ని తాను నెరవేర్చింది. ఇక నామ స్మరణ యొక్క ప్రాముఖ్యత, గొప్పదనం ఆంజనేయ స్వామి చాటిచెప్పాడు. యయాతి మహారాజుకి ఆశ్రయం యిచ్చి, శ్రీరాముడితోనే యుద్ధానికి తలబడి రామబాణం కంటే రామ నామమే గొప్పదని నిరూపించాడు.

సరే, కృష్ణావతార కాలంలో గోపికలు, గోపబాలురు ఏ పని చేస్తున్నా కృష్ణ నామాన్ని వదలకుండా చేసి, భక్తాగ్రేసరులయ్యారు. భక్తికి పరాకాష్ఠ జ్ఞానము. స్వధర్మ ఆచరణ, ప్రకృతి పరమాత్మల అభిన్నత్వమును తెలియజేసే రాధాకృష్ణుల సంవాదం గురించి మాతాజీ ఈ విధంగా తెలియజేశారు.

-సశేషం

గత సంచిక తరువాయి

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

34.శ్లో పురః ప్రసన్నేన ముఖేను తేజసా ।
పురోవ తీర్థస్య కృపా మహామ్బుధేః ।
తదేవ లీలా మురళీ రవామృతం ।
సమాధి విఘ్నాయ కదానుమే భవేత్ ?

తా॥ అనుగ్రహముతో కూడిన చంద్రునివంటి ముఖము యొక్క కాంతి చేత ఎదుట పొడ చూపినవాడు, దయాసముద్రుడైన కృష్ణుని యొక్క ఒయ్యారముతో కూడిన పిల్లనగ్రోవి మోతయను అమృతము నా యొక్క తపోనియమును భంగపరచుట కొరకు మరల ఎప్పుడు కలుగునో!



శ్రీసద్గురుదేవుల పరిపూర్ణ అనుగ్రహంతో ప్రసాదించిన అనర్ఘమైన మహామణి వంటి లక్ష్యార్థాన్ని మనో మరకత పేటికలో భద్రపరచుకున్న సాత్యకి ఆ మణి అపూర్వ కాంతులను దర్శించేందుకు బ్రాహ్మీ ముహూర్తకాలంలో పేటిక తెరచి కన్నులు మూసి ఇంద్రియాలను ముడిచి కూర్చున్నాడు. సాత్యకి ఆరాధ్యదైవం శ్రీ మురళీలోలుడే.

మోక్షసాధనకి నిర్విరామంగా శ్రమించవలసినదే. కడదాకా వెన్నంటి తోడుగా నీడగా సద్గురు నాథులు ఉండనే ఉంటారు. గురుమూర్తి మహదాశీర్వచన పుంభావతను ముందుకు నడిపిస్తుందనే విశ్వాసంతో సాధనకి పూనుకున్నాడు. గమ్యాన్ని చేరాక రెండో వస్తువే వుండదు. ఉండేది బ్రహ్మానంద అనుభవం ఒక్కటే. గురు బోధామృత పానం చేస్తూ సాధనలో ముందు ముందుకు సాగిపోతున్నాడు సాత్యకి. ఒక సమయంలో అతడు పరిసరాలను మరచి ధ్యాన నిమగ్నుడు అయ్యాడు. అనుకోకుండా నాసికాపుటాలకి తులసీ మరిమళాలు సోకి సమాధి సడలింది. అంతలోనే పిల్లనగ్రోవి మ్రోగుతూ చెవులలో అమృతం పోసింది. ఇప్పుడు తపోనియమం భగ్నమైనదని బెంగలేదు. ఎదుట పూర్ణ చంద్రుని వంటి ముఖంతో. దయ తొణికిసలాడుతుండగా, ఒయ్యారంగా నిలచి వేణుగాన లోలుడై ఉన్న శ్రీకృష్ణ పరమాత్మ కనబడి సాత్యకికి

పరమానందం కలిగించాడు. సాత్యకి దేవదేవుడి పాదాలు అంటి నమస్కరించాడు. ప్రభువు తన చల్లని హస్తంతో వెన్ను నిమిరాడు.

"నా తపస్సు ఫలించింది. నీ దివ్య దర్శన భాగ్యం కలిగించింది కృష్ణా!" ఆనందంతో మాటలు రావటం లేదు సాత్యకి ఎలాగో పలికాడు. "ఇది చాలదు సాత్యకీ! నువ్వు సాధనలో యింకా ముందుకి వెళ్ళాలి" అని స్వామి అంతర్ధానమయ్యాడు. సాత్యకి ఖిన్నుడయ్యాడు. తన అనుభవాన్ని గురుదేవులకి విన్నవించుకున్నాడు. వారు చిరునవ్వుతో "ప్రభువు సత్యం పలికాడు. ఆ నిజాన్ని అనుభవంలోకి తెచ్చుకో" అన్నారు. గురువాక్యం అవశ్యం ఆచరణీయం.

సాత్యకి తిరిగి తపోనిష్ఠలో నిలిచిపోయాడు. వాని మనస్సు 'నా సమాధికి భంగం కలిగేటట్లు మునుపటివలె ఎప్పుడు కనిపిస్తావు' అని ఆక్రోశిస్తూ శ్రీకృష్ణస్వామిని వేడుకొంటోంది. ఆ తరువాత మరి కొన్ని సమయాలలో వాని ధ్యాన భంగం చేస్తూ కనబడి అంతలో మాయం అవుతున్నాడు. ఊహలో నిలిచినంతసేపైనా బయట నిలబడటం లేదు. ఎందుకిలా? బోధపడటం లేదు సాత్యకికి. గురుదేవులు మందహాసంతో సమయం వచ్చేవరకు వేచి ఉండవలసినదే. అప్పటి దాకా నీ సాధన విడువ రాదు' అంటున్నారు.

సమాధిలో లీనమైన సాత్యకి నిద్రాహారాలు మానేశాడు. కాలం తెలియటం లేదు. చిత్రంగా ఒకరోజు సాత్యకి కళ్ళు తెరచుకున్నాయి. నాసికేంద్రం వనమాలా పరిమళం ఆఘ్రాణిస్తోంది. వీనుల విందుగా వేణుగానం వినిపిస్తోంది. చుట్టూ చూసిన సాత్యకికి ప్రకృతి నిండా తన నిజనాథుడే నిండి కనిపించాడు. చుట్టూ ఉన్న తరులు, విరులు, సరస్సులు అన్నీ కూడా కృష్ణమయంగా దర్శనమిస్తున్నాయి. పంచ భూతాలు వాని రూపంగా గోచరిస్తున్నాయి. అలా ఎంతసేపు నిలిచి పోయాడో! గురుదేవులు ఎదుట నిలచి వారిని తట్టి పిలించిందాకా! ఇంకా కొంచెం మిగిలే ఉంది వత్సా! అప్పటికి నువ్వు అనుకున్నది సాధించ గలవు" అని వెనుదిరిగి వెళ్ళిపోతున్న వారినే చూస్తూ అలాగే ఉండి పోయాడు సాత్యకి!

(తరువాయి భాగం 30 పేజీలో చూడండి)

## తరగని ఆధ్యాత్మిక సంపద

- జి.వి

"మన దేశం రత్నగర్భం. అంటే మహాత్ములు, జ్ఞానులు, భక్తులు ప్రభవించి ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టిన పవిత్రభూమి. వాటివల్ల ఈ దేశానికి వన్నెవాసి సమకూరింది. ప్రపంచంలోకెల్లా ఆధ్యాత్మిక జ్ఞానపీఠంగా పరిగణన పొందింది. భౌతిక సంపదను ఎంతమంది ఎంత కొల్లగొట్టినా ఈ ఆధ్యాత్మిక సంపదకు ఏలాంటి లోటూ రాలేదు. అది నిరంతరం దేదీప్యమానంగా వెలుగొందుతోంది.

గీతాచార్యుడు బోధించిన జ్ఞానం అనంతమైనది. దానికి కాల దోషంలేదు. గ్రహణ బాధ లేదు. గీతలోనే భక్తి, జ్ఞాన కర్మ యోగాలవంటి ఎన్నో మార్గాలు సూచింప బడ్డాయి. వాటి ద్వారా ఎందరెందరో తరించారు. స్వధర్మ నిర్వహణకు గీతాచార్యుడు ప్రాధాన్యతమిచ్చాడు.



స్వార్జితంతో జీవనం సత్యదృష్టి హరినామ స్మరణ అలవరచుకో"మని మానవజాతికి ఆయన దివ్య సందేశమిచ్చారు.

అహింసా సిద్ధాంతాన్ని బోధించిన బుద్ధ భగవానుడు జ్ఞానవీరుడుగా భాసించాడు. మానవ జీవితం బుద్బుదప్రాయమైనదని జీవకోటిని హెచ్చరించాడు. సర్వ జీవకోటి యెడల దయ కలిగి కరుణతో వ్యవహరించాలని ప్రబోధించాడు.

ఇక శంకర భగవత్పాదులవారు పరమాత్మ వస్తువు జాతి నీతి కుల గోత్రాలకు అతీతమైనది, పిపీలికాది బ్రహ్మ పర్యంతం సర్వవ్యాప్త మైనదని ప్రవచించారు. అట్టి పరమాత్మను తెలుసుకునేందుకు మానవునిలో అడ్డుగా ఉన్న లక్షణాలను, ప్రవృత్తులను తొలగించు కోవాలని హితువు చెబుతూ చరాచర జగత్తులో మనం ప్రేమించ వలసినది, ప్రేమించ దగినది పరమాత్మ వస్తువు ఒక్కటే. సంసార సాగరంలో అశాంతి అలజడి కెరటాలు నిరంతరమైనవి. వీటి బాధ నుండి తప్పించుకొని శాంతి, స్థితప్రజ్ఞ సాధనకు మార్గం అన్వేషించడం మానవుడి కర్తవ్యం. పరమాత్మను ఏకాగ్ర చిత్తంతో ధ్యానిస్తే భగవద్దర్శనం లభిస్తుంది. మీ మనస్సులలో పరమాత్మను నిల్పుకున్నా, పరమాత్మను మీ మనస్సులో నిలుపుకున్నా మీకు కొదవ ఏమీ ఉండదు. అలాంటి స్థితిని పొందలేని

మానవ జీవితం వ్యర్థం. భగవంతుని దర్శనం వల్ల సర్వేంద్రియ తాపం చల్లారుతుంది. వాసుదేవుని దయ సంపాదిస్తే, మీకు ఎలాంటి సంకటాలు యిబ్బందులు, తాపత్రయాలు ఉండవు. పరమశాంతి లభిస్తుంది. భగవన్నామ సంకీర్తన మానవుణ్ణి మాధవునిగా తీర్చి దిద్దుతుంది.

పంచదారకు తీపిగుణం ప్రసాదించిన మూలశక్తి ఎవరో? అలాంటి భగవానుని ఆరాధిస్తే మధురాతి మధురమైన అనుభూతి తప్ప అశాంతి, తాపత్రయాలకు చోటు ఎక్కడ ఉంది? కురుక్షేత్ర సంగ్రామానికి ముందు శ్రీకృష్ణపరమాత్మ సహాయం ఆర్జించటానికి వెళ్ళిన అర్జునుడు ఆయన పాద స్పర్శతో ఆనంద ప్లావితుడు కాగా దర్పానికి అహంకారానికి ప్రతీక అయిన సుయోధనుడు అవివేకిగా వ్యవహరించి కృష్ణుని నిజతత్వాన్ని గ్రహించలేక పోయాడు. మానవసహజమైన వాసనలు జ్ఞానాగ్ని ద్వారా కాని హరించి పోతాయి. మానవ హృదయ కంజాతంలో జ్ఞాన కిరణాన్ని ప్రసరింపజేసి, ఆనంద నిలయంగా మారాలని మహాత్ములు తాపత్రయ పడుతుంటారు. మహిమలు చూపే వారి మాయాజాలం వల్ల మానవులకు శాశ్వత శాంతి, సుఖసంతోషాలు లభ్యం కావు. అనుభవ పూర్వకంగా పరమాత్మ తత్వాన్ని ఎరిగిన సత్యగురువుల పాదపద్మములను ఆశ్రయించడమే భవ బంధములనుండి విముక్తికి ఏకైక మార్గం" అని శ్రీబాబూజీ ఉద్బోధించారు.



**విష్ణు స్వరూపుడవగు ఓ కృష్ణా! నీ రూపమును నాకు చూపుము. నేను చేసిన చెడుపనుల వలన నాకు కలిగిన పాపమును బాపుము. నిన్ను నేను నమ్మినవాడను. ఇది నిజము!**

శ్రీ కృష్ణ శతకము -81

# కనకదాసు

- సుషమ్న ప్రసాద

భగవానుడు భక్తసులభుడు, భక్తప్రియుడు, భక్తవత్సలుడు, భక్త గమ్యుడన్నది నిర్వివాదాంశము. అందుకు మనకు అనేక ప్రత్యక్ష తార్కాణాలు ఉన్నాయి.

ఉడిపిలోని శ్రీ బాలకృష్ణాలయము శ్రీకృష్ణ భగవానుని భక్త ప్రియత్వము, భక్తవాత్సల్యుడన్న మాటకు ప్రత్యక్ష నిదర్శనము. ఆలయంలో ప్రశాంత వాతావరణంలో అష్టదిశలలో అష్ట మఠములున్నవి. ఆలయానికి వెనుక భాగాన మండపంలో మహాభక్తశిఖామణి కనకదాసు విగ్రహం ఉన్నది. ఆలయంలో ఉన్న కోనేరుకు 'మధ్వాచార్య తీర్థ'మని పేరు. మధ్వా చార్యులున్నంత కాలము, సుందరమైన ఆ చిన్న కోనేటి తీర్థమందే స్నానమాచరించి, జపతపోధ్యానాదులు నిర్వహించేవారు. ఈ మధ్వాచార్య తీర్థముతోనే ఆలయ స్వామియైన శ్రీబాలకృష్ణునకు మహా నైవేద్యాది పదార్థములన్నియు తయారుగావించి మహానివేదన చేస్తారు.

ఈ ఆలయంలో స్వామి విగ్రహము ప్రక్కకు తిరిగి ఉంటుంది. భక్తులందరు ఉత్తరపుగోడ గవాక్షముల ద్వారా దేవుని దర్శించాలి. ముఖద్వారమున ఎవరూ వెళ్ళరాదనే నియమం ఉంది. దీనికి కారణం ఏమిటి? ఇదే శ్రీకృష్ణభగవానునికి భక్త ప్రియత్వమునకు భక్తవాత్సల్యానికి నిరుపమాన నిదర్శనం.

పూర్వం పంచమ వర్ణానికి చెందిన కనకదాసనే మహాభక్తుడు ఉడిపి నగరమున నివసించేవాడు. భక్తి యనే కనకముతో భాసించే కనకదాసు నిరంతరం కృష్ణనామస్మరణ చేస్తూ భజిస్తూ, నృత్యము చేస్తుండేవాడు. ఒకరోజు ఆలయంలో స్వామిదర్శనానికి గంపెడు ఆశతో ప్రవేశించగా, కుల మత జాడ్యంలో కూరుకుపోయిన మూఢులైన ఆలయ అర్చక బృందం "ఛీ! మూర్ఖుడా! తుచ్ఛమైన పంచమ వర్ణమున జన్మించి పవిత్రాలయంలో ప్రవేశించటానికి సాహసిస్తావా? నీ రాకతో ఆలయాన్ని అపవిత్రం చేయకు" అని తరిమికొట్టారు.

కనకదాసు "ఆహా! ఆలయంలో స్వామి పాదాల వద్దనే ఉంటున్నా కూడా సత్యమును గ్రహించక, నీ నా భేద భావాలతో మహామాయకు బానిసలై అజ్ఞానముతో నన్ను పొమ్మంటున్నారే! సరే నేను పోతాను. నా బాలకృష్ణుడు నాతోనే ఉంటాడు. మీరు శాంతితో గర్భాలయంలోనే ఉండండి" అని కనకదాసు వెళ్ళిపోయాడు.

అలా వెళ్ళిన కనకదాసు అమితమైన ఆవేదనతో "ఆహా! జ్ఞాన

హీనులు బ్రాహ్మణులయ్యారా! సర్వ మానవ హృదయాంతరాళాలలో ప్రకాశించే ఆత్మజ్యోతిని దర్శించిన వారే నిజమైన బ్రాహ్మణులు. హే! ప్రేమస్వరూపా! దాసపోషకా! దీనబాంధవా! నవనీతచోరా! కుల మత అతీతుడవగు నీ సమక్షంలో బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు కుల వివక్షతను, వైషమ్యమును స్వార్థ మానవులు సృష్టించి, అడ్డుతెరలు నిర్మిస్తున్నారా ప్రభూ!" అని విలపిస్తూ ఆలయం ప్రక్కనే పద్మాసనాసీనుడై, అచంచలమైన దివ్యభక్తితో శరీర స్ఫురణ లేకుండా మనస్సు బాలకృష్ణుని యందు లయముచేసి, నిశ్చలముగ ధ్యాన సమాధిని పొందాడు.

ఆహా! సార్థక నామధేయుడైన కనకదాసు సంపదకు, భాగ్యమునకు ధీటైనది యీ జగత్తులో కానరాదు. జాతి మత కుల తత్త్వములు చూడక నిజమైన ధ్యాననిష్ఠయే మోక్షమునకు చక్కని బాట అని సూచిస్తూ, జగదాచార్యుడగు శ్రీబాలకృష్ణ ప్రభువు కనకదాసు యొక్క అచంచల భక్తినిష్ఠను మెచ్చుకుని, అనుగ్రహించాడు.

అదే సమయంలో తన భక్తుని కోర్కె నెగ్గింపదలచి, మూల విరాట్మూర్తి బాలకృష్ణుడు కనకదాసు ఆసీనుడైయున్న దిక్కుకు మరలి, కనకదాసుకు జ్ఞానచక్షువును యిచ్చి, ఆ మహాభక్తుని తరింపజేశాడు.

అలా బాలకృష్ణుని పరమానుగ్రహానికి పాత్రుడైన కనకదాసు భగవత్సాక్షాత్కారము పొంది బాహ్యదృష్టిని విడిచి, అంతర్ముఖుడై బాలకృష్ణ దివ్యస్వరూపమును సందర్శిస్తూ ప్రపంచమును వీడాడు.

నాటి నుండి నేటి వరకు, ఉడిపి వెళ్ళిన యాత్రకులెవరైనా మహా భక్తుడు కనకదాసు దర్శించిన మార్గములో నుండే శ్రీ బాలకృష్ణుని దర్శించాలి. ముఖద్వారం గుండా దర్శించే నియమం లేదు. బాలకృష్ణుని విగ్రహం మరలిన గోడకు నలుచదరముగా తొమ్మిది రంధ్రాలు ఏర్పరచారు. యాత్రికులందరూ యీ గోడ రంధ్రముల నుండియే స్వామిని దర్శించాలి. చూశారా! కనకదాసు భక్తి పరాకాష్టకు పరవశించిన బాలకృష్ణ స్వామి తన భక్తుడైన కనకదాసు, తనతోపాటు, ఆ చంద్రార్కము భాసిల్లునట్లు అనుగ్రహించి, తాను భక్తప్రియుడు, భక్తగమ్యుడు, భక్తోన్ముఖుడునని భక్తకోటికి అభయమిచ్చాడు. కనకనదాసు బాటలో పయనించిన వారందరూ భక్తియనే కనక వర్షధారలలో జలకమాడి తరించెదరు గాక!

(తరువాయి భాగం 36వ పేజీలో చూడండి)

# శ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమాలు

హైదరాబాద్ బ్రాంచ్ శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమము

17-9-14 బుధవారం నుండి 20-9-14 శనివారం వరకు

ఉదయం 4గం. నుండి 6గం. వరకు సుప్రభాతము, ధ్యానము, ప్రార్థన. 10గం. నుండి 1 గంట వరకు ధ్యానము, సంకీర్తన, సత్సంగ సమావేశం, తీర్థ ప్రసాదములు.

*ఉదయం కార్యక్రమములు జరుగు స్థలం -*

వింగ్ కమాండర్ జి.యస్.మూర్తి,
ఏ - 107 డోకూరి మేఘాద్రి హైట్స్,
హనుమాన్ చౌక్ దగ్గర, స్వర్ణాంధ్ర, యాప్రాల్,
బస్సురూట్ - 24బి, 211యం (సికింద్రాబాద్ నుండి).

సాయంత్రం 5గం.ల నుండి 8గం. వరకు శ్రీమాతాజీవారి బోధామృతం, సత్సంగ సమావేశములు జరుగును.

*సాయంత్రం కార్యక్రమాలు జరుగు స్థలం -*

శ్రీహనుమాన్ దేవాలయం
డా॥ఎ.యస్.రావునగర్, వాటర్ ట్యాంక్ దగ్గర.
బస్సురూట్ - 37, 24ఇ, 16ఎ, 43(సికిందరాబాద్ నుండి)

21-9-14 ఆదివారం ఉదయం 10గం. నుండి 1గం. వరకు సామూహిక శ్రీసద్గురుపాదపూజ, మరియు మాతాజీవారి బోధామృతం, తీర్థం. మాహప్రసాదం.

వివరాలకు :
శ్రీ జి. జగదీశ్వర్ ఫోన్ - 040-27766284, 99856 66797
జి. శ్రీనివాసమూర్తి ఫోన్ - 040- 27865570, 90002 35570

• • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • •

బెంగుళూర్‌లో శ్రీమాతాజీ వారి సత్సంగ సమావేశములు
17-10-14 నుండి 19-10-14 వరకు జరుగును.
వివరాలకు: శ్రీ సాయిబాబాగారు ఫోన్ నెం. 09448 639553

# భద్రం భద్రం భాద్రపదం

డా॥స్వర్ణముఖి ప్రసాద

భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యే మాక్షభిర్యజత్రాః అని వేదం ఘోషిస్తోంది.

మనం వినే విషయాలు, చూసే విషయాలు భద్రంగా ఉండాలి. లేకపోతే మన మనస్సులు కలుషితమయిపోతాయి. క్రిందటి నెల శ్రవణం యొక్క ఆవశ్యకతని గురించి చెప్పుకున్నాం. చక్కగా శ్రవణం చేస్తే చాలా అంటే శ్రవణం చేసినది, నిరంతరం మననం చేసుకుంటూ, మన మనస్సులోను, మెదడులోను భద్రపరచుకుని, నిదిధ్యాసకి తెచ్చుకున్న నాడు మనకి భద్రమైన పదము అందుతుంది.

భాద్రపద శుద్ధచవితినాడు విఘ్నాధిపతిని అర్చించుకున్నాం. సెప్టెంబర్ నెల వచ్చేసింది. ఈ నెల 5వ తేదీన గురుపూజా మహోత్సవం జరుపుకుంటాం. తత్త్వవేత్త, మన రెండవ రాష్ట్రపతి అయిన శ్రీ సర్వేపల్లి రాధా కృష్ణన్‌గారి జయంతిరోజు, 'ఉపాధ్యాయ దినోత్సవం' జరుపుకుంటాం. మన గురుకుల ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులకు మనందరం హృదయ పూర్వక అభినందనలు తెలుపుకుందామా!

9-9-14న భాద్రపద పూర్ణిమ. ఈనాడు మన ఆశ్రమ ట్రస్టు హాస్పిటల్ బృందం, ఆసుపత్రి దినోత్సవ సందర్భంగా శ్రీసద్గురు పాదపూజ మహోత్సవం చేసుకుంటారు.

18-9-14న శ్రీ గురుదశమినాడు చక్కని సత్సంగ సమావేశము, గురుపూజ ఉండనే ఉన్నాయి. సెప్టెంబర్ 24 అమావాస్యతో భాద్రపదానికి గుడ్‌బై చెప్పేస్తాం.

ఇక 'కాళీమాతాకి జై!' అంటూ శరన్నవరాత్రి మహోత్సవాలు 25-9-14 నుండి మొదలయిపోతాయి. వర్షాకాలం వెలిసి, శరద్రుతువు ఆరంభం. ఆశ్వయుజ మాసం శుద్ధ పాడ్యమి అనగా 25-9-14 నుండి 4-10-14 వరకు మనకు అమ్మపూజలు - దసరా పండుగలు సరదాగా భక్తిశ్రద్ధలతో పూజించి, సేవించి, స్మరించి, తరించే తరుణం. శ్రీ గురు దేవులు మనకు ప్రసాదించిన దివ్యవరం!

ఎటు చూసినా జగన్మాత రూపమే. అమ్మ నామాలే. 'శ్రీమాతా! శ్రీ మహారాజ్ఞీ! శ్రీమత్సింహాసనేశ్వరీ! ' అంటూ ఆశ్రమమంతా దద్దరిల్లి

పోతుంది. అశేష భక్త జనానీకం ఉత్సాహానందాలతో అమ్మ పూజలలోను, సంకీర్తనలలోను, పారాయణలోను పాల్గొనే రోజులు, అన్నిటికంటె అత్యంత అమృతమైన 'సత్సంగ అమృత వర్షం'లో మనందరం తడిసి ముద్దయి పోయే తరుణమాసన్నమయింది. అందరం అన్ని సేవలలోను పాల్గొని, మన హృదయాలను చల్లబరచుకుందాం. మన అంతఃకరణని శుద్ధి చేసుకుందాం. మన జన్మలని చరితార్థం చేసుకుందాం.

('శ్రీకృష్ణ కర్ణామృతం' 23వ పేజీ తరువాయి భాగం )

చుట్టూ చీకట్లు ముసురుకున్నాయి. ఎక్కడా వెలుగన్నది లేదు. సమాధిలో మునిగి ఉన్న సాత్యకి లక్ష్యార్థమందే ఏకాగ్రచిత్తుడై వున్నాడు. ఎక్కడా ఏమీ కనబడని మహాంధకారంలో తాను పయనిస్తున్నాడు. ఎవరిదో మృదువైన చేయి తన్ను పట్టుకుని ముందుకు నడిపిస్తున్నది. అంతలో అక్కడే గొప్పవెలుగు అంతటా నిండిపోయింది. కళ్ళు చెదరిపోయేటంత మహాతేజస్సు ఆ ప్రదేశమంతా నిండిపోయి అలుముకుని ఉంది. ఆ కాంతి కిరణాలు కెరటాలుగా వచ్చి సాత్యకిని చుట్టు ముడుతున్నాయి. 'ఇటు చూడు!' అనే శబ్దం ఆయన చెవులకి సోకినప్పుడు వాని కళ్ళకు చూడగలిగే శక్తి వచ్చింది. ఆ దివ్య తేజోమయ రూపాన్ని చూశాడు. ఆ ఆకారం కృష్ణరూపాన్ని ధరించింది.

అంతలోనే తన సద్గురుమూర్తి దివ్యరూపం గోచరించింది. ఆ రూపాలలో తాను ఏకాకారమై కలిసిపోతున్నాడు. విడదీయరాని ఏక రూపంగా మిగిలిపోతున్నాడు. బ్రహ్మానందం వానిలో వెల్లివిరిసింది. 'నేను ఎవరిని?' అని గట్టిగా కేకపెట్టాడు. నువ్వూ నేనూ యీ కనిపించేదంతా ఒక్కటే. నువ్వే నేను, నేనే నువ్వు. భేదం లేదు. 'ఇప్పుడు నువ్వు సాధించినది మోక్షస్థితి. ఆ పైన సాత్యకి లేడు. కృష్ణుడు లేడు. గురుమూర్తి లేడు. అంతా ఏకమైన ఒకే వెలుగు. అదే సాధకునికి చివరి మెట్టు' శ్రీగురుదేవుల అమృత వాక్కులు.

# విజయ దుర్గ

- రమణ ప్రసాద్

పశ్చిమ బంగాల్, ఒరిస్సా, అస్సాం మొదలైన రాష్ట్రాలలో 'దుర్గాపూజ' మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

ఈ ఉత్సవాలను మనం శరన్నవరాత్రుల పేరిట శ్రీకాళీగార్డెన్స్‌లో శ్రీహనుమత్ కాళీవరప్రసాద్ బాబూజీ మహారాజ్‌వారు అత్యంత వైభవంగా చేయించి తమ అనుగ్రహభాషణ భక్తులకు అందజేసేవారు. ఆశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి ఆధ్వర్యంలో ఈనాటికీ ఘనంగా సాగుతోంది. భక్తులు వేలకొలది సంఖ్యలో ఈ ఉత్సవాలలో పాల్గొంటారు.



భగవతి దుర్గాదేవిని అనన్య భక్తితో ఆరాధించినవారిపై వాత్సల్యం కురిపించే మాతృమూర్తిగా అనుగ్రహ వర్షాన్ని కురిపించి వారి కోర్కెలను తీరుస్తుంది. నిత్య నిర్గుణ పరబ్రహ్మ స్వరూపిణి అయినా దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ నిమిత్తంగా దివ్య లీలారూపాలను ధరించి రాక్షస సంహారం చేసి జగద్రక్షణ కావిస్తోంది. తైత్తరీయ కృష్ణయజుశ్శాఖలోని యజ్ఞిక్యుపనిషత్ (నారాయణీం)లో 'త్వామగ్నివర్ణాం తపసా జ్వలన్తీం వైరోచనం కర్మఫలేషు జుష్టామ్। దుర్గాం దేవీగ్ం శరణమహం ప్రపద్యే సుతరసి తరసే నమః'

"ఓ దుర్గా! నీవు శృతి స్మృత్యాగమ ప్రసిద్ధవు. అగ్నివలె జాజ్వలమాన రూపము కలదానివి. నీ భక్తులను ద్వేషించేవారిని దహింపజేస్తావు. సర్వాధిష్ఠానమగు పరబ్రహ్మవు. నిన్ను సేవించే భక్తులు స్వర్గ-పశు-ధన పుత్రాది ఫలాలను పొందుతారు. అంతేకాదు నీ భక్తులను నీవు సంసార సాగరం నుంచి తరింపజేస్తావు. అట్టి నిన్ను శరణుజొచ్చుచున్నాను."

కాత్యానాయ విద్మహే కన్యకుమారి ధీమహి।తన్నో దుర్గి ప్రచోదయాత్ ॥

"గజ చర్మాంబర ధారియైన పరమేశ్వరుడు 'కాత్యాయనుడు' అన బడుచున్నాడు. ఆ పరమేశ్వరుని ఆశ్రయించుటచే 'కాత్యాయని' అని పేరు వచ్చింది. కన్యకుమారి అంటే స్వప్రకాశ స్వరూపిణి అని అర్థము.

నవరాత్రోత్సవాలలో 'కుమారి'గా పూజింపబడుతుంది. అట్టి భుక్తి ముక్తి ప్రదాత్రి దుర్గాదేవిని నిరంతరం ధ్యానిస్తాము. అట్టి ధ్యానమునందు ఆమె మమ్ము ప్రవర్తింప జేయుగాక!"

భగవతి దుర్గ సర్వజగజ్జనని. ఆమె సర్వులకు ఉపాస్యురాలు అవుతుంది. తల్లిచెంత చేరే అధికారం అందరికీ ఉంది. దుర్గామాత సగుణస్వరూపిణి.ఆ దేవిని జటాజూటధారిణియై, పూర్ణేందుబింబాననయై, అతసీ పుష్పశోభితయై, నవ యౌవనవిలాసియై, సర్వాభరణ భూషితయై, మనోహరదశనాంబితయై, దశబాహుసమన్వితయై, త్రిశూల-ఖడ్గ-చక్ర-తీక్ష్ణ బాణ శక్త్యాదులు దక్షిణభాగమందు, పాశ-అంకుశ-పరశు-చేట-పూర్ణచాప-ఘంటాదులను వామ భాగాన ధరించిన మహిషాసుర మర్ధినియైన మహనీయ మూర్తిగా భావించవలెనని దేవీ భాగవతం చెబుతోంది.

సచ్చిదానంద స్వరూపిణి, సృష్టిస్థితిలయకారిణి, భక్తజన రక్షా దీక్షా ధారిణి భగవతి శ్రీదుర్గాదేవి వారణాసి మొదలైన పుణ్యక్షేత్రాలలో అర్చామూర్తియై అనవరతము భక్తులచేత అర్చింపబడుతోంది. విజయ వాటికలో ఇంద్రకాలాద్రిపై 'కనకదుర్గ' అనే కమనీయ నామధేయంతో విలసిల్లుతూ తన చల్లని చూపులతో ఎల్ల జీవులని హృదయాలను విరాజింపజేస్తోంది.

ఆమెయే మాతృరూపేణ సంస్థిత అయిసర్వభూతాలలో మాతృ రూపంగా ఉన్న 'శ్రీమాత'. మహావైభవంతో కూడిన గొప్పరాణి తనకన్న అధికులులేని 'శ్రీమహారాజ్ఞీ'. శోభతో కూడిన సింహాసనాన్ని అధిష్ఠించిన 'శ్రీమత్సింహసనేశ్వరీ', 'చిత్' జ్ఞానము లేక బ్రహ్మము అను హెూమ గుండంలో అవతరించిన 'చిదగ్నికుండ సంభూతా'. దేవతల కార్యసిద్ధికై అవతరించి భండాసుర మహిషాసురాది రాక్షసులను సంహరించటానికై అవతరించిన దేవి.

ఈ దేవిని ఏ రూపంలో ఆరాధిస్తే ఆ రూపంలో సాక్షాత్కరించి వరాలనిస్తుంది. ఈమెను వేదాలు గాయత్రిగా, ఉపనిషత్తులు, ఉమ, గంగ, రాజరాజేశ్వరి, మహాకాళీ, మహాసరస్వతిగా, మహాలక్ష్మిగా పామర జనులు అంకాళమ్మ, పోలేరమ్మ, నాంచారమ్మ అనే దేవతలుగా భావించి తరించారు. అట్టి పరమేశ్వరిని ఆరాధించటమే ఆత్మ సాక్షాత్కారానికి ఏకైక మార్గం!!

(గత సంచిక తరువాయి) **సత్సంగామృతం** - మురళీ

(శ్రీబాబూజీ మహరాజ్ వారి రజతోత్సవ మహాపుణ్యారాధన మహోత్స వాలలో భాగంగా ది. 29-11-2013 గురువారం రోజున శ్రీ మాతాజీ అందించిన బోధామృతం సంక్షిప్తంగా)

మానవుడి స్వభావం సహజంగా ఎట్లా ఉంటుందంటే తనకు నచ్చినట్లుగా మాట్లాడాలి, దాని వెనుక ఎంతో ఆనందం ఉంటుంది. మనం అనుకునే మాయల్లో యిదొక పెద్ద మహామాయ. గురువుల సన్నిధిలో ఉంటే, మనకి నచ్చినట్లుగా మనం మెచ్చినట్లుగా మాయకు సంబంధించినటువంటివి, మహాత్ముల దగ్గర దొరకవు. వారి దగ్గర ఎలా ఉంటాయంటే మనల్ని ఉన్నత స్థితికి తీసుకు వెళ్లటానికి తగినట్లుగా మనలో అహంకారమో, గర్వమో ఎక్కడా పొడచూపకుండా కాపాడుతారు. రాబోయే గర్వాన్ని కూడా రాకుండా ఆపుతారు.

మనిషి పెరగడు, పొంగడు, కుంగడు, కాని లోపల జన్మలను పెంచేటటువంటి కొన్ని మానసిక స్థితులుంటాయి. ప్రపంచంలో ఉన్న వాళ్ళు మనస్సును పొంగిస్తూ ఉంటారు. మనస్సుకు తావిస్తూ ఉంటారు. కాని మహాత్ముల దగ్గర మనస్సు ఎప్పుడూ పాదాల దగ్గర అణిగి మణిగి ఉండాల్సిందే. ఏదైనా ఆనందం కలిగి గట్టిగా నవ్వినా కూడా వెంటనే గురుదేవులు మందలిస్తారు. మారు మాట్లాడకుండా కూర్చుండిపోతాం. మహాత్ముల దృష్టి శ్రేయోదాయకమైనది. వారి ఆచరణ పద్ధతి శ్రేయోదాయకంగా, మంగళప్రదంగా ఉంటుంది. మన జీవిత ధ్యేయాన్ని అందుకునేటట్లుగా ఉంటుంది.

ఈ మహాత్ముల పాదసన్నిధిలో ఏ మాత్రం జ్ఞానంలేని మన వంటి అభాగ్యులకు ఉండటానికి యింత స్థానం దొరికింది అంతే. 'గత జన్మంబున గొప్ప పుణ్యమెదియో గావించి.............' అన్నట్లుగా ఎంత గొప్ప పుణ్యం అంటే దేనితోనూ తూచటానికి సరిరాదు. ఒక్కసారి వెనక్కి తిరిగి టాలీ చేసుకోండి. మనం చేసినదెంత? మనకి గురుదేవుడు ప్రసాదించిన దెంత? అని. మనం ఎంత సాధన చేస్తున్నాము? అంటే భగవంతుని వైపుకి ఎంత ప్రయత్నం చేస్తున్నాము? మనకి ఆశ్రయం యిచ్చిన గురుదేవుని దివ్య చరణం మనకు ఎంత, ఎంతెంత ప్రసాదించిందో. అది అక్షరాలతో గాని, పదాలతోగాని చూపించటానికి వీలులేనంత.

గురుభగవానుడు  అక్షయ స్వరూపుడు. ఎందుకంటే అంతా తానే అయిఉన్న ఆ పరమాత్మలోనే మనం ఉన్నాము. ఇప్పుడు కొంతసేపు రామాలయంలో, కొంతసేపు యాగశాలలో, కొంతసేపు బృందావనంలో ఉంటున్నాము. ఈ కదలికలన్నీ జీవుడికి ఉన్నాయి. గురుదేవుడు కూటస్థ చైతన్య పరబ్రహ్మ. అనంతంగా ప్రకాశిస్తున్నారు గురునాథులు. అనంతంగా వ్యాపించి ఉన్న భగవంతుడిలో మనం ఎన్ని ఆటలాడుకుంటున్నామో, ఎన్ని పాటలు పాడుకున్నామో, ఆయనకు తెలియకుండా చిన్న కదలికయైనా చేయగలమా! గుర్తు వచ్చినప్పుడు భగవంతుడు ఎంత గొప్పవాడో అనుకుంటున్నాము.  లోకాభిరామాయణంలో  పడితే  అనవసరపు విషయాలు ఎంతగా చర్చిస్తామో సమయమే తెలియదు. భగవంతుడు గుర్తురానే రాడు. ఎంత చెప్పినా, ఎంత చేసినా ఏమి లాభం?

శ్రీగురుదేవులు అంటుండేవారు సున్నాలు ఎన్నిఉన్నా వాటికి విలువ ఏమీ ఉండదు. వాటికి ఆధారమైన ఆ 'ఒకటి' చేరితేనే సున్నలకు విలువ వచ్చేది, ఆ ఒకటే పరమాత్మ. నువ్వు గురుతత్త్వాన్ని అందుకునే వరకు సుఖం ఉండదు. మూడు సార్లు తిని, ఆరు సార్లు వెళ్ళటానికా యీ జీవితం? దీనికి కూడా మానవ జన్మ రావాలా? పశువులు, పక్షులు తినటం లేదా? పిలల్ని కనటం లేదా? మనుష్యులకు వాటికి తేడా ఏమిటి? నిన్ను గుర్తించటానికి ఆత్మ జ్ఞానం వైపు అడుగువేయకపోతే నువ్వు రెండు కాళ్ళ పశువువు అవుతావు. అందుకని పశుత్వాన్ని పోగొట్టుకుని ఈశ్వరత్వాన్ని సిద్ధింప చేసుకోవాలి. నీ అసలు స్వరూపం ఈశ్వరత్వం, ఈశ్వరస్వరూపం అంటే ఏమిటి? మన తండ్రి అనంతంగా ప్రకాశిస్తుంటే, ఆయనను దర్శించటానికి వెళ్తే మనం ఎంత ప్రకాశిస్తాం? దేహం మార్పుతో కూడింది. దేహం పతనమవుతుంది. కానీ నీలో ఉన్న చైతన్యానికి మార్పు లేదు.

నువ్వు విషయాదుల గురించి ఆలోచిస్తుంటే నీ సమయం అంతా దుర్వినియోగం అయిపోతుంది. గురుదేవులు మన శ్రేయస్సును కోరుతారు. ఈ ప్రపంచంలో సంచరించేటప్పుడు జాగ్రత్తగా నడవాలి. అడుగులు ఆలోచించి వేయాలి. కర్మకు ఒడిగట్టకు. కర్మ బద్ధుడవు అవ్వకు. నువ్వు వేసే అడుగులు ధర్మప్రకారం వేస్తే, ధర్మ స్వరూపులైన మన గురుదేవులే మనను అనుగ్రహిస్తారు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **హనుమద్వైభవము** - సుషుమ్న ప్రసాద

ఇక హనుమ వాయుపుత్రుడని వినుతికెక్కాడు కదా! ఒకసారి కామరూపిణియైన అంజన క్షామ వసన ధారిణియై, అద్భుత సౌందర్య రాశియైన మానవకాంతగా, పర్వతశ్రేణిపై సంచరిస్తుండగా, వాయు దేవుడామె సౌందర్యానికి ముగ్ధుడై చటుక్కున ఆమెను ఆలింగనం చేసుకున్నాడు. ఆ సంఘటనకు చకితురాలైన అంజన కోపంతో "ఎవరండీ మీరు? నా ఏకపతి వ్రతమునకు భంగం కలిగించటానికి వచ్చారా?" అని ప్రశ్నించింది.

అప్పుడు వాయుదేవుడామెతో "నీవేమీ భయపడనక్కర్లేదు. నేను నిన్ను మనసా పొంది ఉండుటచే నీ పాతివ్రత్యానికి ఎట్టి భంగం ఉండదు. నా అంశతో నీకు పరాక్రమశాలి, ధీమంతుడైన పుత్రుడు జన్మిస్తాడు. అతడు గొప్ప సత్త్వము తేజస్సు బలముతో నాతో దీటుగా ప్రకాశిస్తాడు" అని వరమిచ్చాడు. అందుచేత అంజనా తనయుడుగా ఉద్భవించిన హనుమ రుద్రాంశ, విష్ణ్వంశ, వాయువంశ సమ్మేళనంతో అవతరించాడు.



పువ్వు పుట్టగానే పరిమళించినట్లు పసితనమందే బాల హనుమాన్ మహిమ, ప్రతిభ, ముల్లోకములందు విస్తరించింది. బాల హనుమ పసిబిడ్డగా ఉన్నప్పుడు, అంజనాదేవి ఫలాలను సేకరించటానికి అరణ్యానికి వెళ్ళింది. ఆ సమయంలో ఆకలి వేసిన శిశువు మారుతి ఆకాశంలో సూర్యబింబం చూసి పండని భ్రమించి, ఒక్క ఉదుటన ఆకాశానికి ఎగిరాడు. అది రాహుగ్రహణ సమయం. రాహువు కూడా సూర్యుని గ్రహించటానికి సమీపిస్తున్నాడు. ఒక్క ఉదుటున సూర్యుని సమీపిస్తున్న హనుమను చూసి భయపడి, ఇంద్రుని సమీపించి, "నాకు యీ సమయాన సూర్యచంద్రులను ఆహారంగా యిచ్చావు కదా! కాని ఇప్పుడు మరొకడు కూడా సూర్యుని గ్రహించటానికి వచ్చాడు. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించాడు.

వెంటనే ఇంద్రుడు క్రోధావేశంతో, ఐరావతాన్ని ఎక్కి వెళ్ళగా వాయు సుతుడు ఐరావతాన్నే ఎదిరించాడు. 'పసిబాలుడు ఐరావతాన్ని ఎదిరించటమా!' అని ఆశ్చర్య చకితుడై ఆగ్రహంతో వజ్రాయుధాన్ని మారుతిపైకి విసిరాడు. వెంటనే ఆ వజ్రాయుధం అంజనానందుని దవడను గాయపరచింది. 'హనుమ' అంటే దవడ అని అర్థం. అందుచేతనే

హనుమంతుడయినాడు. దవడ దెబ్బతిని మూర్ఛపోయిన పసివానిని వాయుదేవుడు ఒడిలోకి తీసుకుని, గుహలోనే ఉండి పోయాడు. వాయుదేవునకు చలనం లేకపోయేటప్పటికి, లోకాలన్నీ స్తభించిపోయాయి.

ఇలా జగాలన్నీ క్షోభిస్తుంటే, బ్రహ్మాది దేవతలందరూ గుహలోకి వచ్చి, హనుమను స్పృశించారు. హనుమ మూర్ఛ నుండి లేవగా, వాయువు వీచసాగాడు. అప్పుడు బ్రహ్మాదిదేవతలు హనుమకు శస్త్రాస్త్ర విద్యలన్నిటిలో ప్రావీణ్యమును, మహాబలమును, చిరాయువును వరాలుగా ప్రసాదించారు. సూర్య భగవానుడు తన తేజస్సులో భాగం యిచ్చాడు. బ్రహ్మ కామరూపాది విద్యలను ప్రసాదించాడు. అలా హనుమ సర్వదేవతానుగ్రహం పొందిన తరువాత వాయుదేవుడు పుత్రుని అంజనకు అప్పజెప్పి వెళ్ళిపోయాడు.

-సశేషం

( 'కనకదాసు' 27వ పేజీ తరువాయి భాగం)

ఉడిపి శ్రీబాలకృష్ణ దేవాలయ ప్రాశస్త్య మెట్టిదనగా ఒకసారి శ్రీమధ్వాచార్యులవారు తన శిష్యబృందంతో గంగానదిలో నౌకాయానము చేయుచుండగా వారి వద్దకు ఒక రాయి కొట్టుకు వచ్చింది. దానిని తీసుకుని పరిశీలించగా అది పోపీ చందనపు రాయి అన్నారు. దానిని ఉడిపి తీసుకువెళ్ళి భక్తుల సమక్షంలో పగలగొట్టగా దానిలో నుండి మహదానందమును చూపరులకు ప్రసాదించి, ముద్దులొలికే ముచ్చటైన మనోజ్ఞమైన శ్రీబాలకృష్ణుని విగ్రహం లభించింది. ఆ విగ్రహమును వారక్కడ ప్రతిష్ఠించారు. అక్కడే అఖండమైన జ్యోతిని ప్రజ్వలింపజేశారు. ఆ జ్యోతి యెల్లప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటుంది.

శ్రీమధ్వాచార్యులవారు త్రివేణి సంగమమునకు వెళ్ళి అక్కడి పవిత్ర తీర్థమును సువర్ణకలశములతో నింపి మత్తేభాలపై ఉడిపికి తీసుకువచ్చారు. ఆ దేవాలయం చెంతనే కోనేరు త్రవ్వి, అందులో యీ తీర్థం పోశారు. అది నిత్యగంగలా ప్రవహిస్తోంది. ఆచార్యులవారు అది దక్షిణ త్రివేణి అని అంతటి పవిత్రత సంతరించుకుంటుందని కోనేటి మహిమను వివరించారు. భగవంతునితోపాటు భక్తుని ధీటుగా వెలసినది ఉడిపి క్షేత్ర మహిమ!

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

– విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

రాజమండ్రిలో జయంతులు జరుగుతున్నాయి. ఒకరోజు గురువుగారు మరికొంతమంది భక్తులతో కలసి గోదావరి స్నానానికి వెళ్ళారు. 'ఒక్క మునుగు మునిగి వచ్చేస్తాం కదా! శ్రీబాబుతో చెప్పటం ఎందుకులే' అని చెప్పకుండానే వెళ్ళారు. స్నానం చేస్తుండగా వాళ్ళందరూ సుడిగుండంలో చిక్కుకుని లోపలకు పోతున్నారు. గట్టుమీద ఉన్న వాళ్ళల్లో శ్రీహరిగారు, తమ కుమార్తె సుశీల మునిగిపోతూ ఉండటం చూసి, 'బాబూ! సుశీల మునిగిపోతోంది' అని కేకలు పెట్టుకుంటూ శ్రీబాబు వద్దకు పరుగెత్తారు. శ్రీబాబు "జగన్మాతా! బిడ్డలను రక్షించు" అని అమ్మను స్మరించుకుని, "ఫరవాలేదులే వెళ్ళు. మా అమ్మ చూసుకుంటుంది" అని శ్రీహరిగారితో అన్నారు.



శ్రీహరిగారు తిరిగి వచ్చి చూసేసరికి, పల్లెవాళ్ళు వచ్చి మునిగిపోయిన వారందరినీ బయటకు తీసి రక్షించారని తెలిసింది. గురువుగారు భయపడుతూనే అందరితో యింటికి వెళ్ళారు. వాకిట్లోనే నిలబడి ఉన్న శ్రీబాబు "ఓహో! గురువు గారి నాయకత్వంలో వెళ్ళారన్నమాట. కనీసం నాకు చెప్పి వెళ్ళాలని కూడా అనిపించలేదు మీకు. చూశారుగా! గురువుగారు ఎలా రక్షించుకున్నారో మిమ్మలను" అన్నారు. గురువుగారితో సహా అందరూ అపరాధం అయిందని లెంపలు వేసుకున్నారు.

శ్రీబాబు మెడలో గొలుసుకు ఒక చిన్న గంట ఉండేది. ఇందిరను ఆవేశించిన గ్రహం ఒకొక్కసారి ఉన్నట్లుండి 'అదిగో అదిగో గంట మోగుతోంది. ఆయన వచ్చేస్తున్నాడు' అనేది. ఆ గంట ఎవరికీ వినబడేది కాదు. అంతలో శ్రీబాబు వచ్చేవారు.

'మాకెవరికీ ఆ గంట వినబడలేదు. శ్రీబాబు వస్తున్నట్లుగా

తెలియలేదు. నీకు యివన్నీ ఎలా తెలిశాయే?' అని గురువుగారు అడిగేవారు.

ఇందిర 'పిశాచాలకు చాల శక్తులు ఉంటాయిలే. ఆయన మెడలో ఉన్న అంత చిన్న గంట ఎక్కడో మైళ్ళ అవతల మోగుతుంటేనే నాకు వినబడుతుంది. ఆయనా కనబడతాడు. ఏం లాభం? అన్నీ తెలిసిన నాకు యీ బ్రహ్మపిశాచి జన్మ రావటం మహా ప్రారబ్ధం. ఇటువంటి నీచ జన్మల నుండి విముక్తి కలిగించే శక్తి కేవలం శ్రీబాబు వంటి పరమేశ్వర స్వరూపులకే ఉంటుంది. అందుకే, ఇందిరను పట్టుకుంటే యీ మహాత్ముడి దర్శనము, అనుగ్రహం లభిస్తాయనే ఆశతో దీనిని ఆవేశించాను. ఆయన చేతి చలవ వల్ల నాకు పిశాచ జన్మ వదలటమే కాకుండా ఉత్తమ గతులు కూడా లభిస్తాయి' అని ఇందిరను ఆవేశించిన గ్రహం చెప్పింది. శ్రీబాబు ఆ గ్రహాన్ని ఎంతో సానుభూతితోనూ, ఆదరణతోనూ చూసేవారు.

ఇందిరకు రానురాను బాగా స్వస్థత కలిగింది. కాని అప్పుడప్పుడు ఆ గ్రహం తన లక్షణాలు చూపిస్తూనే ఉండేది. ఒకనాడు శ్రీబాబు ఇందిరను పిలిచి (గ్రహంతో) "ఇహ నీవు ఇందిరను విడచి వెళ్ళు. నీకు యీ జన్మ నుండి శాశ్వతంగా విముక్తిని కలిగిస్తున్నాను" అన్నారు.

అప్పుడు ఇందిర (గ్రహం) గురువుగారిని, యితర భక్తులను పిలిచి 'ఇక నేను ఇందిరను విడిచి పోతున్నాను. ఈ పిశాచ జన్మ నుండి శాశ్వతంగా విముక్తి పొంది శ్రీబాబులోనే లీనం అయిపోతున్నాను. ఇందిరను యింత కాలమూ నా స్వార్థం కోసం పీల్చి పిప్పి చేశాను. ఆమెను యిక నుంచి ఒక గాజు బొమ్మలాగా జాగ్రత్తగా చూసుకోండి. శ్రీబాబును మాత్రం ఎన్నటికీ వదులుకోకండి' అని చెప్పింది.

ఆ తరువాత మళ్ళీ ఆ గ్రహ లక్షణాలుగాని, దాని జాడగాని ఇందిరలో కనిపించలేదు. ఆ విధంగా ఇందిరను ఆవేశించిన గ్రహం, అనుగ్రహంగా మారి తాను తరించటమే కాక గురువుగారికి, ఇందిరకి వారి కుటుంబ సభ్యులందరికి తరణోపాయమైన శ్రీ గురుచరణారవింద ప్రాప్తిని కలిగించింది.

-సశేషం

విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

## 8. సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి

ఒకనాడు కావేరీ నదీ తీరాన ఆశీనుడై ఉండగా సదాశివుల వారు సమాధి స్థితులయ్యారు. పైన కుండ పోతగా వర్షం పడుతున్నా చలించలేదు. నదిలో నీటిమట్టం పెరిగింది. ఆ వరదలో సదాశివుల వారు కొట్టుకుపోయారు. ప్రజలంతా నిస్సహాయంగా ఉండిపోయారు. సదాశివ బ్రహ్మేంద్రులవారు ఈ విధంగా నీటిలో కొట్టుకుపోయి శరీరాన్ని విడిచినందుకు అక్కడివారంతా ఎంతో వ్యథ చెందారు.



మూడు నెలల తర్వాత కావేరీ నది తీరంలో ఒక రైతు ఇసుక తవ్వుతున్నాడు. ఆహా! ఏమి ఆశ్చర్యం? అతని పారకు రక్తపు మరకలు అంటాయి. అతను జాగ్రత్తగా ఇసుక తీసి చూశాడు ప్రశాంత మూర్తి లాగా ధ్యాన స్థితిలో ఉన్నారు శ్రీ సదాశివులవారు. ప్రజలంతా దిగ్భ్రాంతి చెందారు. ఆయనను శివావతారమని శ్లాఘించారు.

జ్ఞాని శరీరి అయినా అతడు శరీర పరిధిలో ఉండడు. అక్కడ జన సమూహం పై తన చల్లటి చూపులను ప్రసరింప చేసి, తన మహోత్కృష్ట మైన స్థితిని ఈ విధంగా తెలియచేశారు.

*పూర్ణ బోధోహం సదానంద పూర్ణ బోధోహం*
*ప్రత్యగాత్మాహం ప్రకటిత పత్యఘనోహం*
*శృత్యంత శతకోటి ప్రకటిత బ్రహ్మహం*
*నిత్యోహ మభయోహం అద్వితీయోహం*
*సాక్షిమాత్రోహం ప్రగలిత పక్షపాతోహం*
*మోక్షన్విరూపోహ మోంకార గమ్యోహం*
*సూక్ష్మహ మనఘూహ మద్భుతాత్మహం*

-సశేషం

## హైదరాబాద్ శాఖ భవన నిర్మాణం



ప్రియాత్మ బంధువులారా!

హైదరాబాద్‌లో ఉన్న ఆశ్రమ ప్రాంగణంలో ఐదు అంతస్థుల భవన నిర్మాణం చేయాలని సంకల్పించటమైనది అన్న విషయం బాబూజీ మహరాజ్ భక్తులమైన మనందరికీ తెలిసినదే. ధనాభావం చేత 5వ అంతస్థు నిర్మాణం ఆపివేసి 4అంతస్థులకు స్లాబులు వెయ్యటం జరిగింది. భక్తులు ఇప్పటివరకు ఇచ్చిన విరాళాలతో తదితర నిర్మాణపు పనులు కూడా చురుకుగా సాగుతున్నాయి.

పూజ్య మాతాజీవారు ఈ నూతన భవన ఆవిష్కరణకు, శ్రీ సద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠకు జనవరి 22వ తేదీ తెల్లారుజామున 1గం॥35నిలకు ముహూర్తం కూడా నిర్ణయించినారు. కనుక భక్తులందరూ ఈ బృహత్కార్యంలో పాల్గొని, వస్తురూపంలోకాని, ధనరూపంలోకాని తమ సహాయ సహకారాలను అందించమని ప్రార్థిస్తున్నాము. భక్తులు విరివిగా విరాళాలు అందించి శ్రీ మాతాజీ నిర్ణయంచిన సమయానికి ఈ భవన నిర్మాణం పూర్తి చేయటానికి తోడ్పడమని విన్నవించు కుంటున్నాము.

మీ విరాళాలను క్రాస్ చేసిన చెక్కు లేక డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరుతున్నాము. ఇతర వివరాలకు శ్రీకుమారస్వామి రాజాగారిని(సెల్ నం.09346535357) సంప్రదించి తెలుసుకోవలసిందిగా కోరుతున్నాము. మీరు ఇచ్చే విరాళాలకు ఐ.టి సెక్షన్ 80 జి రాయితీ లభిస్తుంది.

శ్రీబాబు భక్త సమాజ్ (హైదరాబాద్)

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL